
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబ్‌నగర్
గురువారం 31, ఆగస్టు 2017, పేజీలు 20





జిల్లా కేంద్రంలో విగ్రహాల ఊరేగింపు

- కన్నుల పండువగా నిమజ్జనం
- ఆకట్టుకున్న నృత్యాలు
- కిటకిటలాడిన గడియారం చౌరస్తా
- ఎస్పీతో మాట్లాడి డీజేలకు అనుమతి ఇప్పించిన మంత్రులు
- ప్రత్యేక లారీల్లో బీచుపల్లికి విగ్రహాలు

3

వినాయకా.. సెలవిక!

జిల్లా కేంద్రం, జడ్చర్లతో పాటు పలు ప్రాంతాల్లో బుధవారం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు అందుకున్న విగ్రహాలను సాయంత్రం నుంచే ఊరేగించారు. డీజే సౌండ్స్‌కు కుర్రకారు నృత్యాలు చేశారు. జిల్లా కేంద్రంలో చేపట్టిన వేడుకల్లో మంత్రులు జూపల్లి కృష్ణారావు, డా.సి.లక్ష్మారెడ్డి,



మంత్రులు జూపల్లి కృష్ణారావు, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, గువ్వల బాలరాజును సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ

ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, గువ్వల బాలరాజు పాల్గొన్నారు. వారిని వేదిక మీదికి ఆహ్వానించిన ఉత్సవ కమిటీ ఘనంగా సన్మానించింది. విగ్రహాలను చూడడానికి తరలొచ్చిన ప్రజలతో గడియారం చౌరస్తా కిక్కిరిసింది. ఈ సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు చేపట్టారు. ఊరేగింపు అనంతరం విగ్రహాలను లారీల్లో బీచుపల్లికి తరలించారు.



భక్తులతో కిక్కిరిసిన గడియారం చౌరస్తా

సీపీఎస్ రద్దు కోసం ఉద్యమం

- పాత పింఛన్ విధానమే కావాలంటున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు
- ఒక్కతాటిపైకి సంఘాలు
- రేపు సామూహిక సెలవు

11



జిల్లా కేంద్రంలో ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

సీపీఎస్(కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకం)ను రద్దు చేయాలనే డిమాండ్ ఊపందుకున్నది. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఈ విధానంలో భద్రత లేకుండా పోయిందని, అనివార్య పరిస్థితులు దాపురిస్తే కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తోందనే ఆందోళన రోజురోజుకు పెరిగిపోతోంది. పన్నెండేళ్ల కిందట అమల్లోకి వచ్చిన దీన్ని రద్దు చేసి, పాత విధానాన్నే కొనసాగించాలంటూ రాష్ట్రంలో ఉద్యమం కొనసాగుతోంది. సీపీఎస్ పరిధిలోని ఉద్యోగ, ఉపాధ్యాయులంతా జేఏసీగా ఏర్పడి, దీన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు తాజాగా సెప్టెంబర్ 1(శుక్రవారం)న రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయులు సామూహికంగా సెలవు పెట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆయా శాఖాధిపతులకు లేఖలు కూడా సమర్పించారు.

– మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

గడువుకు ముందే మిషన్ పూర్తి చేయాలి

- అక్టోబర్ నాటికి ముగించాలి
- జనవరి నుంచి ఇంటింటికి నీరందించాలి
- మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ సి.లక్ష్మారెడ్డి
- జడ్పీలో మిషన్ భగీరథ పథకంపై సమీక్ష

7



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి; చిత్రంలో మంత్రి లక్ష్మారెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● మార్కెట్ కమిటీ చైర్మన్ బండి వేణుగోపాల్



నారాయణపేట: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ బండి వేణుగోపాల్ అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు.

రైతుబజార్ ప్రారంభంలో ఎందుకు జాప్యం జరిగింది?

పట్టణంలో 35,54,262 లక్షలతో 16 దుకాణాల సముదాయం, 27,28,609 లక్షలతో కూరగాయల మార్కెట్ లోపల రెండు షెడ్లు, కార్యాలయం, టాయిలెట్స్ నిర్మించారు. రైతు బజార్‌కు సంబంధించి ఇన్ గేట్ ఉండగా ఔట్ గేట్ కూడా మున్సిపాలిటీ పాలక అధికార యంత్రాంగంతో మాట్లాడి ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ఎస్‌ఆర్‌రెడ్డితో చర్చించి త్వరలోనే రైతు బజార్ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

రైతు బజార్ ముఖ్య ఉద్దేశ్యం ఏమిటీ?

దళారి వ్యవస్థకు చెక్‌పెట్టి పండించిన కూరగాయలను నేరుగా రైతులు రైతు బజార్‌లో విక్రయించడం కోవడం వలన ఇటు రైతులకు, కొనుగోలు దారులకు మేలు చేకూరేలా తక్కువ ధరలోనే కూరగాయలు అందుబాటులోకి వస్తాయి. సంబంధిత రైతులకు మార్కెటింగ్ శాఖా ద్వారా గుర్తింపు ఐడీ కార్డులను అందిస్తాం.

గోదాం ఎప్పుడు ప్రారంభిస్తారు?

నాబార్డ్ కింద వ్యవసాయ మార్కెట్ యార్డులో 2,500 మెట్రిక్ టన్నుల గోదాంను రూ.1.5 కోట్లతో నిర్మించారు. కందుల సీజన్ లో మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని ఈ గోదాంలోనే ఏర్పాటుచేసి రికార్డు స్థాయిలో కందులను కొనుగోలు చేసి రాష్ట్రంలోనే కొనుగోళ్లలో అగ్రగామిగా నిలవడం జరిగింది. ఈ గోదాం రైతులకు ఎంతో ఉపయోగపడుతుంది. త్వరలోనే గోదాంను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

36 దుకాణాల అసంపూర్తి పనులు ఎప్పుడు పూర్తి చేస్తారు?

ఎమ్మెల్యే ఎస్‌ఆర్‌రెడ్డి చొరవతో మార్కెటింగ్ శాఖా మంత్రి హారీశ్ రావ్ అసంపూర్తి నిర్మాణాలకు అదనంగా రూ.56 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో పనులను త్వరితగతిన పూర్తిచేసి మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

వివిధ రకాల ధాన్యం తూకాలలో హామాలి కూలీ ధరలు ఒక్కో మార్కెట్‌లో ఒక్కోరకంగా ఉన్నాయి కదా?

జిల్లా వ్యాప్తంగా అన్నీ మార్కెట్‌లలో వివిధ ధాన్యాలకు హామాలి కూలీ ధరలు ఒకేలా ఉండేందుకు జేసీ శివకుమార్ నాయుడు ఓసారి సమావేశాన్ని నిర్వహించగా వాయిదా పడింది. మరోమారు సమావేశం నిర్వహించి ఒకే ధర అమలయ్యేలా చూస్తామని జేసీ చెప్పారు.

ఈనాం అమలు ఎలా ఉంది?

ఈనాంను పూర్తిస్థాయిలో అమలు పరిచేందుకు యార్డులో చర్యలు తీసుకుంటున్నాం. అన్నీరకాల ధాన్యాలను ఈనాంలోనే క్రయ విక్రయాలు జరిగేలా చూడడం జరుగుతుంది. తక్ పట్టీలను విధిగా అందేలా చూస్తున్నాం. రైతులకు గిట్టుబాటు ధర లభించేందుకు అన్నీ చర్యలు తీసుకుంటున్నాం.

ఈ ఏడాది మార్కెట్ టార్గెట్ ఎంత ఉంది?

ఈ ఏడాది మార్కెట్ టార్గెట్ రూ.1.40 కోట్లు ఉంది. ఈ టార్గెట్‌ను అధిగ మించేందుకు సిబ్బంది సమష్ఠి కృషితో పాలక వర్గం అన్నీ చర్యలను తీసుకుంటుంది.

మార్కెట్ యార్డులో సీసీ కెమెరాలు ఎన్ని ఏర్పాటు చేస్తున్నారు?

ఈనాం అమలయ్యే అన్నీ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగానే యార్డును సందర్శించి నివేధికలు సిద్ధం చేశారు. 2లక్షలతో 30 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేం దుకు ప్రతి పాదనలు పంపించాం. త్వరలోనే సీసీ కెమెరాల ఏర్పాటుతో మూడో నిఘా యార్డులో ఉంటుంది.

చింతలు తీర్చే చింతల రాయ స్వామి



స్వయంభూగా వెలసిన చింతల రాయ స్వామి

రథం

- భక్తుల కోర్కెలు తీర్చుతూ విరాజిల్లుతున్న సింగారం చింతల రాయుడు
- 300 ఏళ్ల క్రితం స్వయంభూగా వెలసిన వెంకటేశ్వర స్వామి
- ప్రతి ఏటా ఘనంగా చింతల రాయుడి జాతర ఉత్సవాలు

నారాయణపేటరూరల్: నమ్మిన భక్తుల చింతలు తీరుస్తూ కొలిచిన వారికి కొంగు బంగారంగా నారాయణపేట మండలంలోని సింగారం గ్రామ చింతల రాయస్వామి గత 300 ఏళ్ల నాటినుంచి ప్రతి రోజు నిత్య పూజలందుకుంటూ భక్తులకు కొంగు బంగారంగా నిలుస్తున్నాడు. ఇక్కడి స్వామివారి దేవాలయ చుట్టుపక్కల చింత చెట్లు ఉండడంతో పాటు కోరిన భక్తుల చింతలు తీర్చే స్వామిగా ప్రసిద్ది గాంచడంతో ఈస్వామివారు చింతల రాయుడిగా ప్రఖ్యాతి పొందారు. పేట మండలంలోని సింగారం గ్రామంలో వెలసిన చింతల రాయస్వామి గత 300 ఏళ్లక్రితం ఇక్కడ స్వయంభూగా వెలసినట్లు ఇక్కడి పూర్వీకులు చెప్తున్నారు. అప్పట్లో ఈగ్రామంలో ఉగాది పాఢ్యమి మొదలుకొని చైత్ర బహుళ పాఢ్యమి వరకు పక్షం రోజుల పాటు గ్రామస్థులు జాతర ఉత్సవాలు నిర్వహించేవారు. ఐతే కాలక్రమేణా ఈఉత్సవాలు ఐదురోజులకు, ఆతర్వాత మూడ్రోజులకు కుధించబడి ప్రస్తుతం చైత్ర చతుర్ధశి రోజు ఆలయ పూజారి ఇంటి నుంచి ఉత్సవ మూర్తుల విగ్రహాలను భజనా మండలి సభ్యులతో పాటు గ్రామపెద్దలు, గ్రామస్థులు పెద్దఎత్తున ఊరేగింపుతో దేవాలాయానికి చేరుకుంటారు. అదేరోజు రాత్రి ప్రభోత్సవం నిర్వహిస్తారు. అనంతరం పౌర్ణిమిరోజు మహారథోత్సవం, ఉద్దాలసేవ, పాఢ్యమిరోజు చింతల రాయస్వామివారికి చక్రస్నానాలతో ముగింపు కార్యక్రమాలను గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు పరిసర గ్రామాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు వివిధ పట్టణాల్లో స్థిరపడ్డ పలువురు పెద్ద ఎత్తున చేరుకుని స్వామివారికి మొక్కుబడులు చెల్లించుకుంటారు. సింగారం చింతల రాయ స్వామిని కొలిచిన భక్తులు అమెరికాలాంటి దేశాల్లో రాణించి అక్కడే స్థిరపడ్డారని గ్రామస్థులు చెప్పుకొస్తున్నారు. గత 300 ఏళ్లక్రితం వెలసిన చింతల రాయస్వామి (వెంకటేశ్వర స్వామి) దేవాలయం ఎన్నో ఏళ్ళక్రితం దేవాదాయ శాఖలో కలుపుకున్నారు. కొన్నేళ్ళుగా ఆలయ కమిటీ చైర్మెన్‌గా అదే గ్రామానికి చెందిన కొంకల్ నర్సింహారెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా ఈ దేవాలయానికి వంశం పారంపర్య ధర్మకర్తలుగా కొప్రేషాచారీ కుటుంబ సభ్యు లు కొనసాగుతున్నారు.

ఈ దేవాలయంలో ధర్మకర్తలు వ్యవహరిస్తున్న వారు ఇప్పటికీ ప్రతినిత్యం స్వామివారికి నిత్యపూజలు చేస్తున్నారు. ఈదేవాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పంచాంగ శ్రావణం, ధ్వజారోహణం, ప్రతి ఏటా శ్రావణ మాస ప్రత్యేక పూజలు, దసారా, దీపావళి తదితర పండుగల ప్రత్యేక రోజుల్లో ఈ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ కొనసాగుతూ వస్తుంది. అదేవిధంగా ఈస్వామివారి సన్నిధిలో నిరుపేద కుటుంబాలకు చెందినవారి వివాహాలు నిర్వహిస్తారు. ప్రస్తుతం దేవాలయం పుననిర్మాణ దశలో ఉండగా దేవాదాయ శాఖ నుంచి నిధులు సైతం మజూరైనట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు.



సింగారంలో చింతల రాయ స్వామి దేవాలయం

మూడు తరాల నుంచి పూజలు చేస్తున్న



సింగారం చింతల రాయ స్వామివారి దేవాలయంలో మూడు తరాలుగా వంశం పారంపర్యంగా పూజలు నిర్వహిస్తు వస్తున్నాం. గత 30ఏళ్ళుగా మేమే స్వామివారికి నిత్యపూజలు కొనసాగిస్తున్నాం.ఈస్వామివారిని కొలిచిన వారికి కోరిన కోర్కెలు తీరుతాయి.

కొప్రేషాచారి, ఆలయ అర్చకులు
సింగారం, నారాయణపేట మం..

9 ఏళ్లుగా ఏకో మట్టి గణపతి ప్రతిష్ఠ

ఆధ్యాత్మికం

● పర్యావరణ పరిరక్షణకు ఆర్యవైశ్య సంఘం కృషి

నారాయణపేట: పర్యావరణ పరిరక్షణకు ఆర్యవైశ్య సంఘం కృషిచేస్తుంది. గత 9 ఏళ్లుగా ఏకో మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తు భక్తిశ్రద్ధలతో శాస్త్రబద్దంగా సంస్కృతిని పరిరక్షిస్తు వినాయక పూజా కార్యక్రమాలను నిర్వహిస్తు ఆదర్శంగా నిలుస్తు వస్తున్నారు. నారాయణపేట నగరేశ్వర స్వామి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నైజాం పాలన నుంచే వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తు వస్తున్నారు. ఆరంభంలో కొంత కాలం చిన్న చిన్న వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించగా మధ్యలో కొంతకాలం భారీ వినాయక విగ్రహాలను ప్రతిష్ఠిస్తు వచ్చారు. 2007లో ఆర్యవైశ్య సంఘం అప్పటి అధ్యక్షుడు పూరి బస్వరాజ్ సూచనల మేరకు ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు పేపర్ వినాయకుడిని ప్రత్యేకంగా తయారు చేయించి ప్రతిష్ఠించారు. 2008 నుంచి ప్రతిఏటా ప్రత్యేకంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠిస్తు వస్తున్నారు. పర్యావరణ పరిరక్షణకు ఆర్యవైశ్య యువజన సంఘం చర్యలు తీసుకుంటున్న దృష్ట్యా సర్వత్రా హార్షం వ్యక్తమౌతుంది.

పర్యావరణ పరిరక్షణ కోసం...



ఆర్యవైశ్య సంఘం పెద్దలు సూచించిన విధంగా యువజన సంఘం సభ్యులు సమిష్ఠిగా పర్యావరణ పరిరక్షణ కోసం 9ఏళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠిస్తు వస్తున్నారు. యువత మొత్తం పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించడం హర్షణీయం.

● **అన్‌పూర్ సుదీంద్ర,ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు,నారాయణపేట**



ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన ఏకో మట్టి గణపతి

ఎలాంటి ఎర్రర్‌లు ఉన్నాయో కంప్యారింగ్ చేయాలి

● జాయింట్ కలెక్టర్ కె. శివకుమార్‌నాయుడు

కలెక్టరేట్ మహబూబ్‌నగర్: జరుగుతున్న రెవెన్యూ రికార్డుల క్యూరిఫికషన్ లో గుర్తించిన ఎర్రర్‌లలో ఎలాంటి ఎర్రర్‌లు ఉన్నాయో కంప్యారింగ్ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, సబ్‌కలెక్టర్ నారాయణపేట, మహబూబ్‌నగర్ ఆర్‌డీఓలకు సూచించారు. ఈ విషయంపై గురువారం (నేడు) జిల్లా కలెక్టర్‌లకు సీఎం దగ్గర సమావేశం ఉందన్నారు. బుధవారం జాయింట్‌కలెక్టర్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి అన్ని డివిజన్ లు,మండలాల రెవెన్యూ అధికారులు , ఎపీడీఓలు, ఏపీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 563 గ్రామ పంచాయతీలున్నాయనిఅందులో 301 పంచాయతీలల్లో రెవెన్యూ రికార్డుల క్యూలో ఎలాంటి ఎర్రర్‌లు ఉన్నాయన్నది స్పష్టం రాయాలని సూచించారు.

● **టాయిలెట్లతో పాటు డంపింగ్ యార్డులు పూర్తి అయితే ఓడీఎఫ్‌గా ప్రకటన**

స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద 87 గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛాభారత్ కింద 87 మరుగుదొడ్ల గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులు అక్టోబర్ 31 వరకు పూర్తిచేసుకుంటేనే ఆ గ్రామాన్ని ఓడీఎఫ్ కింద ప్రకటిస్తారని జాయింట్ కలెక్టర్ సంబందిత అధికారులకు సూచించారు. ఇప్పటి 17 గ్రామలను ఓడీఎఫ్ కింద ప్రకటించామని మరో 20గ్రామాలు ఆన్ గోయింగ్‌లో ఉన్నాయన్నారు. 50గ్రామ పంచాయతీలలో డంపింగ్ యార్డులు నాట్‌స్టాటెడ్ ఉన్నాయి. కారణాలేమిటని ఎంపీడీఓలను ప్రశ్నించారు. అందుకు ఎంపీడీఓలు మాట్లాడుతూ తహసీల్దార్‌లు భూమిని చూయించలేదన్నారు. కొంత మంది చూయించిన అక్కడ రాలులన్నాయని (రాక్‌స్టాండ్(మరికొన్ని గ్రామానికి దూరంగా ఉండడం వల్ల గ్రామం సర్పంచ్ ఒప్పుకోవడం లేదన్నారు. ఏప మండలాల్లో ఎన్ని గ్రామ పంచాయతీలు ఉన్నాయని మండల వారిగా సమీక్షించారు. రైతు సమగ్ర రిపోర్టులు,కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్, సాదాబైనామ సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు.

రైతే రాజు

- సమన్వయ సమితుల ఏర్పాటుకు రంగం సిద్ధం
- జిల్లాలో కార్యవర్గాలను నామినేట్ చేయనున్న మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి
- ఈనెల 1నుంచి 9లోపు కొనసాగనున్న నియామకాల ప్రక్రియ
- భవిష్యత్ లో కీలకమవనున్న సమన్వయసమితులు
- జిల్లాలో 569 గ్రామ రైతు సమన్వయ సమితులు

(మహబూబ్‌నగర్,ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయతలపెట్టిన రైతుసమన్వయసమితుల నియామకాలకు జిల్లాలో ప్రాథమిక కసరత్తు మొదలయింది. రెవెన్యూ గ్రామాల వారీగా గ్రామ రైతు సమన్వయ సమితి, మండల సమన్వయ సమితి, జిల్లా సమన్వయ సమితుల కార్యవర్గాలు వచ్చేనెల 9లోపు ఏర్పాటవనున్నాయి. జిల్లాలో అన్ని స్థాయిల సమితుల నియామక బాధ్యతలను డాక్టర్ సి.లక్ష్మారెడ్డికి అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. వ్యవసాయ ,రెవెన్యూశాఖల్లో సంస్కరణలను అమలు చేయాలని భావిస్తున్న ప్రభుత్వం ఈసమితులను సంస్కరణల అమలుకు వేదికగా నిలిపే క్రమంలో ఈ నియామకాలు అన్ని స్థాయిల్లో కీలకమవబోతున్నాయి.

జిల్లాలో 569 గ్రామ సమన్వయసమితుల ఏర్పాటు

రెవెన్యూగ్రామాల వారీగా గ్రామ సమన్వ యసమితులు ఏర్పాటు చేయాలని జీవోనెం.39లో పేర్కొన్న ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాలో 569 గ్రామ రైతు సమన్వయ సమితులు ఏర్పాటు కాను న్నాయి. వీటితో పాటు 25 గ్రామీణ మండలాలున్న జిల్లాలో 25 మండల సమన్వయ సమితులు, ఒక జిల్లా స్థాయి సమన్వయ సమితి ఏర్పాటు చేసేం దుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఫారమ్-1బీ రిజిస్టర్ ప్రకారం జిల్లాలో 3,41,713 మంది రైతులు నమోదయి ఉండగా, ప్రాథమికంగా ఈ జాబితా నుంచే గ్రామ సమన్వయ సమితి సాధారణ సభ్యులను గురిస్తారు. ఈ సభ్యులనుంచే గ్రామ సమన్వయ సమితికి 15 మంది సభ్యులను ఎంపిక చేస్తారు. గ్రామ సమితికి ఎంపిక చేసే సభ్యులు వ్యవసాయం చేస్తున్నవారై ఉండడంతో పాటు, గ్రామంలోనే నివసిస్తున్న పట్టా దారు అయి ఉండాలి. గ్రామసమితిలో మూడోవంతు మహిళా రైతులుం డడంతో పాటు, ఆ గ్రామంలో ఉన్న అన్ని కులాల వారికీ సమితిలో స్థానం కల్పిం చాలి. 24 మంది సభ్యు లుండే మండల సమన్వయ సమితి, 42 మంది సభ్యులుండే జిల్లా సమన్వయ సమితి ఎంపికలో కూడా ఈనిబంధనలను పాటించా ల్సి ఉంది. గ్రామ సమన్వయ సమితికి నియమి తులైన సభ్యుల్లో ఒకరిని గ్రామ సమితి సమన్వ యకర్తగా జిల్లా మంత్రి నియమిస్తారు. అదే విధంగా మండల సమితికి మండల సమన్వయకర్త, జిల్లా సమితికి జిల్లా సమన్వ యకర్తను నియమిస్తారు. జిల్లాస్థాయిలో కలెక్టర్ నోడల్ అధికారిగా వ్యవహ రిస్తారు. ఏ జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో సమితిల ఏర్పాటు ప్రక్రియ కొనసాగుతుంది.

కీలమవనున్నసమితుల పాత్ర:

అదేవిధంగా పంటల కాలనీల ఏర్పాటు, భూముల సర్వేలలోనూ సమితులు క్రియా రాష్ట్ర ప్రభుత్వం వచ్చే ఏడాది నుంచి రైతులకు అందించనున్న పంటల ప్రోత్సాహకం ఎకరాకు పంటకు రూ.4వేల మొత్తాన్ని ఈ సమితుల ద్వారానే ఇవ్వనుండడం, అర్హులైన రైతుల జాబితాను కూడా సమన్వయ సమితే రూపొందించాల్సి ఉండడంతో వీటి పాత్ర కీలకమవనుంది. దీంతో పాటు రెవెన్యూ శాఖలోనూ గ్రామ స్థాయి వ్యవహారాలు, భూముల క్రయ, విక్రయాలు, తగాదాలను కూడా సమన్వయ సమితి ద్వారా నమోదు చేయాలని ప్రభుత్వం నిర్ణ యిం చడం వీటికి భవిష్యత్ లో ఇవ్వనున్న స్థానాన్ని తెలి యజేస్తోంది. అదేవిధంగా పంటల కాలనీల ఏర్పాటు, భూముల సర్వేలలోనూ సమితిలు క్రియాశీ లకం కానున్నాయి. గ్రామాలలో సర్వేల అనంతరం గ్రామసభలను నిర్వహించి, రైతులు సాగు చేస్తున్న పంటల విస్తీర్ణాలను మొదటి దశలో ఎంపిక చేస్తారు. వివాదాలు, కోర్టుల కేసులు ఉన్న భూములను ఈదశలో మినహాయిస్తారు. ఈ సర్వే ద్వారా గ్రామం లో సాగులో ఉన్న రైతుల జాబితాలను తయారు చేస్తారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికి ఈ ప్రక్రియ పూర్తికానుంది. అదేవిధంగా పంటల అమ్మకాల సమ యంలో రైతులకు మద్ధతు ధర దక్కకపోతే, ఆ పంటలను గోదాముల్లోనిల్వ చేసుకొని రైతులు రుణా లు పొందేందుకు గాను రాష్ట్ర సమితికి రూ.500 కోట్ల రివాల్వింగ్‌ఫండ్ నిప్రభుత్వం ఇవ్వనుంది. ఈ రుణాలు పొందేందుకు రైతులను కూడా సమితులే సిఫార్సు చేయాల్సి ఉంటుంది. వీటితో పాటు వ్యవసాయ, అనుబంధరంగాల్లో రైతులకు అన్ని సమయాల్లో ఈ సమితిల ద్వారా తోడ్పాటుని, ప్రోత్సాహాన్ని అందించేం దుకు ప్రభుత్వం సన్నద్ధమ వడంతో వీటికి ప్రాధాన్యత పెరగనుంది.

వినాయకా.. సెలవిక!

- కన్నుల పండువగా నిమజ్జనం
- ఆకట్టుకున్న నృత్యాలు
- కిటకిటలాడిన గడియారం చౌరస్తా
- ఎస్పీతో మాట్లాడి డీజేలకు అనుమతి ఇప్పించిన మంత్రులు
- ప్రత్యేక లారీల్లో బీచుపల్లికి విగ్రహాలు

మహబూబ్‌నగర్ టౌన్: పట్టణంలో వినాయక నిమజ్జనం బుధవారం రాత్రి కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా గడియారం చౌరస్తాలో పండుగ వాతావరణం నెలకొంది. శాంతి భద్రతల దృష్ట్యా పోలీసులు డీజేలను నిషేధించడంతో గడియారం చౌరస్తాలో గణేష్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన స్వాగత వేదిక వద్ద అనుమతి ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను సమీక్షించడానికి వచ్చిన ఉమ్మడి జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డా.సి.లక్ష్మారెడ్డి ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన స్వాగత వేదిక వద్దకు వచ్చారు. ఎస్పీతో మాట్లాడి, డీజేలకు అనుమతి ఇప్పించారు.

మంత్రులు, ఎమ్మెల్యేలకు సన్మానం

గణేష్ ఉత్సవ సమితి స్వాగత వేదిక మీదికి వచ్చిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్‌లను నాయకులు ఘనంగా సన్మానించారు. డీజేలు ఇప్పించేందుకు తగిన చొరవ చూపిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్‌కు కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. వీరితోపాటు వేదిక వద్దకు వచ్చిన అతిథులను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మద్దియాదిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు.

శాంతియుతంగా జరుపుకోవాలి

నిమజ్జన ఊరేగింపును పట్టణ ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని మంత్రులు జూపల్లి కృష్ణారావు, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ కోరారు. డీజేలు ఉన్న వారు తక్కువ సౌండ్‌తో త్వరగా క్లాక్ టవర్ చేరేందుకు చొరవ చూపాలని కోరారు. క్లాక్‌టవర్ చేరుకున్న పుట్టపర్తి సాయిబాబా సమితి ప్రతిష్ఠించిన వినాయక విగ్రహానికి మున్సిపల్ కార్మి కులు, మంత్రులు, ఎమ్మెల్యే హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. మున్సిపల్ హమాలీ యూని యన్ ఊరేగింపులో కార్మికుల కట్టె విన్యాసాన్ని మంత్రులు, ఎమ్మె ల్యేలు తిలకించారు. వారి ప్రతిభను మెచ్చుకున్నారు. విగ్రహాలకు స్వా గతం పలికే కార్యక్రమంలో అచ్చం పేట ఎమ్మెల్యే, గువ్వల బాలరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధాఅమర్, వైస్ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

● విగ్రహాలను బీమపల్లి తరలించేందుకు అధికారులు ప్రత్యేకంగా లారీలను ఏర్పాటు చేశారు. వీటిని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉంచారు.

● గడియారం చౌరస్తాకు వచ్చే భక్తులకు వస్త్ర యాజమాన్య సంఘం ప్రసాదాన్ని పంపిణీ చేసింది.

పోలీసుల మోహరింపు

నిమజ్జనం సందర్భంగా ఎస్పీ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన పోలీసులకు డ్యూటీలు వేశారు. నిమజ్జన ఊరేగింపు శాంతియుతంగా జరిగేందుకు తగు చర్యలు తీసుకున్నారు.

కిటకిటలాడిన గడియారం చౌరస్తా

వినాయక విగ్రహాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో గడియారం చౌరస్తాకు చేరుకోవడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది. విగ్రహాల ముందు విన్యాసాలు, నృత్యాలను ఆసక్తిగా తిలకించారు.



ఊరేగింపుగా వెలుతున్న దృశ్యం

చర్చనీయాంశంగా పేట మున్సిపల్ ఇంజనీర్ అరెస్టు

నారాయణపేటటౌన్: పేట మున్సిపల్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న ఖాజా హుస్సేన్ ను మంగళవారం గద్వాల జిల్లా పోలీసులు అరెస్టు చేయడంతో పేటలో బుధవారం చర్చనీయాంశంగా మారింది. 2011 సెప్టెంబర్‌లో పేట మున్సిపల్ ఇంజనీర్‌గా విధుల్లో చేరారు. నాటి నుంచి నేటివరకు మున్సిపల్ ఇంజనీర్‌గా కొనసాగుతున్నారు. నాల్గుపర్యాయాలు మున్సిపల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఎఫ్ఏసీ కమిషనర్‌గా 15, మే 2012 నుంచి 29 సెప్టెంబర్ 2012 వరకు, 20 ఏప్రిల్ 2014 నుంచి 20, జూన్ 2013 వరకు రెండో సారి, 20, ఏప్రిల్ 2015 నుంచి 3 మే 2015 వరకు కొన సాగి 21, జూన్ 2016 నుంచి 25 జూలై 2016 లో కూడా అద నంగా కమిషనర్ బాధ్యతలను చేపట్టారు. ఐతే ఇంజనీర్ ఖాజా హుస్సేన్ పేట మున్సి పాలిటిలో పూర్తిస్థాయిలో ఇంజనీర్ బాధ్యతలు నిర్వ హిస్తునే ఐజ నగర పంచాయతీలో 2015 నుంచి 2016 వరకు ఇన్ చార్జీ ఇంజనీర్‌గా విధులు చేపట్టారు. ఆ సమయంలో ఐజ నగర పంచాయతీలో రూ.80 లక్షలకు పైగా ప్రజాధనం దుర్వినియోగం అయినట్లు ఐజ ఇన్ చార్జీ కమిషనర్ యాదగిరి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన అనంతరం ఇంజనీర్ ఖాజాహుస్సేన్ ను మంగళవారం అరెస్టు చేశారు. మంగళవారం పేట మున్సిపాలిటీలో విధులకు హాజరయ్యారు. మధ్యాహ్న సమయంలో విధులకు హాజరు కాలేదు. ఐతే గద్వాల పోలీసులు ఇంజ నీర్‌ను పిలిపించు కున్నట్లు తెలిసింది. పేట మున్సిపల్ అధికారులు, కాంట్రాక్టర్లు ఇంజనీర్ అరెస్టు అయిన సమాచారం వినగానే ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఏదేమైనా ఈ మున్సిపాలిటీలో కూడా విచారణ చేపడితే ఇక్కడ కూడా అవినీతి అక్రమాలు బైటపడే అవకాశం లేకపోలేదని పట్టణ ప్రజలు చర్చించు కుంటున్నారు. పేట మున్సిపాలిటీలో ఇంజనీర్‌తో పాటు పూర్తిస్థాయి అదనపు కమిషనర్ బాధ్యతలు జోడు పదవులు నిర్వహించిన సమయంలో నిధులు ఏమైనా పక్కదారి పట్టాయా అన్న అనుమానాలకు సైతం తావిస్తుంది. అరెస్టుతో కాంట్రాక్టర్లలో ఒక్కసారిగా స్థబ్ధత నెలకొంది. ఐతే కాంట్రాక్టర్లు చేసిన పనుల బిల్లులు రావాల్సి ఉండడంతో కాంట్రాక్టర్లలో ఆందోళన నెలకొంది.

'సీపీఎస్ రద్దు దీక్షను జయప్రదం చేయండి'

గండీడ్ : కొత్త పింఛన్ విధానం రద్దు కోసం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా వచ్చే నెల 1న ధర్నా దీక్షకు ఉద్యోగ ఉపాధ్యాయులందరూ హాజరు కావాలని టీఎస్ సీపీఎస్ ఈఏ అధ్యక్షుడు కృష్ణగౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి సీపీఎస్ బాధితులంతా అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

హన్వాడ : పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని చేపట్టనున్న ధర్మదీక్షకు భారీగా తరలిరావాలని సీపీఎస్ డివిజన్ అధ్యక్షుడు పరమేశ్వర్ ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు.



అంగన్ వాడీలోని చిన్నారికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

విద్యార్థులకు ఎంఆర్ టీకాల పంపిణీ

హన్వాడ : మండల కేంద్రంలోని అంగన్ వాడీ కేంద్రంలో బుధవారం ఎంపీటీసీ-2 రాధ, ఏఎన్ఎం నజ్మా, కార్యకర్తలు చిన్నారులకు ఎంఆర్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 9 నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలందరికీ ఈ టీకాలు వేయించాలని సూచించారు.

సీపీఎస్ మండల కమిటీ ఎన్నిక

హన్వాడ : సీపీఎస్ మండల కమిటీని జిల్లా అధ్యక్షుడు బాలస్వామి సమక్షంలో స్థానికంగా ఎన్నుకున్నారు. ఈమేరకు కమిటీ నూతన అధ్యక్షుడు మల్లేష్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రధాన కార్యదర్శిగా రవికుమార్, కోశాధికారిగా మహేశ్వర్, మహిళా అధ్యక్షురాలిగా లక్ష్మి, కన్వీనర్‌గా శిల్ప, ఉపాధ్యక్షురాలిగా మాధురి, హేమలత, కోశాధికారిగా అరుంధతితో పాటు మరికొందరిని సభ్యులను ఎన్నుకున్నారు.

'సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి'

గండీడ్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈఓ సత్తార్ సూచించారు. మండలంలోని గాదిర్యాల్‌లో రైతు హన్మంతు వేసిన పత్తిపంటలో బుధవారం లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుట్టలను ఏర్పాటు చేయడం వల్ల క్రిముల నాశనమై మేలు చేకూరుతుందన్నారు. దీంతో పంట దిగుబడి అధికంగా వస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది అంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళ

మహబూబ్‌నగర్ రూరల్ : శివశక్తి గ్రూప్ ఫర్టిలైజర్స్ కంపెనీలో సేల్స్ ట్రైనీ ఉద్యోగులుగా వచ్చే 1న కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని ఈజీఎంఎం ఆఫీసులో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● టీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొప్పుల హరీశ్వర్‌రెడ్డి పిలుపు

గండీడ్ : ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొప్పుల హరీశ్వర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులైన వారందరికీ చేరేలా కృషి చేయాలన్నారు. అదే విధంగా గ్రామస్థాయిలో ఏర్పాటు చేసే రైతు కమిటీల్లో భాగస్వాములై ఉన్నతమైన వ్యవసాయాన్ని చేసే వారిని ఎంపిక చేసినట్లైతే ఆ అన్నదాతలు పలువురికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. త్వరలో ప్రభుత్వం నుంచి మహిళలకు దసరా కానుకగా చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టనుందన్నారు. తెల్లరేషన్ కార్డు కలిగిన వారందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు కమిటీల ద్వారానే ప్రభుత్వ నిధులు వస్తాయని, అలాంటి నిధులతో రైతులందరికీ ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీ వెంకట్, పరిగి మార్కెట్ చైర్మన్ అంజనేయులు, వైస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచులు గోపాల్, రాములు, కృష్ణయ్య, ఎంపీటీసీలు జనార్దన్ గౌడ్, నాయకులు కృష్ణగౌడ్, గోపాల్‌రెడ్డి, హన్మయ్య, బాలవర్దన్ రెడ్డి, రాజుగౌడ్, గిరిధర్‌రెడ్డి, రాంరెడ్డి ఉన్నారు.



టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్వర్‌రెడ్డి



గణేష్ మండప నిర్వాహకులతో హరీశ్వర్‌రెడ్డి

వినాయకుడికి పూజలు

స్థానికంగా టీఆర్ఎస్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి కొప్పుల హరీశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగలను అందరూ శాంతియుతంగా, భక్తిభావంతో నిర్వహించుకోవాలన్నారు.

బాధితులకు పరామర్శ

మండలంలోని కపిలాపూర్‌లో వారం రోజుల క్రితం టీఆర్ఎస్ మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఖాదర్ తండ్రి ఉస్మాన్ అనారోగ్యంతో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని కొప్పుల హరీశ్వర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఉస్మాన్ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన వెంట బాలవర్దన్ రెడ్డి, భూదేవి ఉన్నారు.

హన్వాడ మండల అధికారుల నంబర్లు

తహసీల్దార్	9000101448
ఎంపీడీఓ	8008901009
విద్యుత్ ఏఈ	9440813462
ఆర్అండ్‌బీ ఏఈ	9440819271
పీఆర్ఏఈ	9440296836
ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ	7995660181
వాటర్‌గ్రిడ్ఏఈ	7995660183
వ్యవసాయశాఖ ఏఓ	7288894301
ఎస్సై	9490619630
ఎంఈఓ	9440251313
ఏపీఓ	7095503717
ఏపీఎం	8790990669
పీహెచ్ సీ డాక్టర్	8328654909
ఆయుర్వేదిక్ డాక్టర్	9440770070
పశువైద్యాధికారి	9704628855

మ. నగర్ మండల అధికారుల నెంబర్లు

తహసీల్దార్	9100901417
ఎంపీడీఓ	8008901021
ఎస్సై	9440795708
వ్యవసాయ ఏడీ	7288894300
ఎంఈఓ	9490411969
విద్యుత్ ఏఈ	9440813890
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	7995660171
ఆర్అండ్ బీ ఏఈ	9440819260
ఐబీ ఏఈ	9701375933
ఏపీఎం	8790990653

హన్వాడ మండల కార్యదర్శుల నెంబర్లు

గుడ్డిమల్కాపూర్	9581598168
వేపూర్	9505015454
కొత్తపేట్	9441030527
సల్లోనిపల్లి	7842949108
మునిమోక్షం	9505528829
కొనగట్టుపల్లి	8106750019
బుద్దారం	9582394810

గండీడ్ మండల అధికారుల నెంబర్లు

ఎంపీడీఓ	9949995465
తహసీల్దార్	9100901419
ఎంఈఓ	9490501256
ఎస్ఐ	9440627266
వ్యవసాయ అధికారి	7288894664
ఏపీఎం	9177303893
ఏపీఓ	7095505237
ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ	8886332085
ఎఫ్ఎస్ఓ	9490019169

కలెక్టరేట్ భవనం మారిస్తే యుద్ధమే

● తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి నర్సింహా

పాలమూరు : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవనాన్ని పాలకొండకు మారిస్తే యుద్ధమే అవుతుందని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంత్రి నర్సింహా అన్నారు. పాలమూరులోని ఆ సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చరిత్ర గల కలెక్టరేట్ భవనాన్ని రాజకీయ నాయకులు తమ భూముల డిమాండ్ పెరగాలని, వారి లబ్ధి కోసం మారుస్తున్నారని అన్నారు. నడిబొడ్డున ఉన్న కలెక్టరేట్ మారిస్తే వ్యాపారులకు, దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు ఇబ్బందులకు గురవుతారని అన్నారు. కలెక్టరేట్ భవనాన్ని మార్చాలనుకుంటే ఉన్న స్థలంలోనే హంగులతో కూడిన నూతనగా నిర్మించుకోవాలని సూచించారు. కలెక్టరేట్ మారిస్తే టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, ఆ పార్టీ నాయకులను వదిలి పెట్టామని హెచ్చరించారు. కలెక్టరేట్‌ను మార్పు వంటి నిర్ణయాలు మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నర్సింహా

స్థానిక సెలవు వివాదం.. హెచ్ ఎంకు మెమో

హన్వాడ : మండలంలోని మునిమోక్షం జడ్పీహెచ్ ఎస్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గ్రామంలో గణేష్ నిమజ్జనం ఉందని బుధవారం స్థానిక సెలవును ప్రకటించారు. అయితే జడ్పీహెచ్ ఎస్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయురాలు అనురాధ మంగళవారం సెలవులో ఉండగా ఆమెకు స్థానిక సెలవు విషయం చెప్పకపోవడంతో బుధవారం యదావిధిగా పాఠశాలకు వచ్చింది. అయితే ఆమె అక్కడి విషయాలు డీఈఓకు నేరుగా చెప్పడంతో దీనిపై ఆయన స్పందించారు. ఉన్నతాధికారులకు కూడా ఈ విషయం తెలియడంతో తహసీల్దార్‌ను గ్రామానికి వెళ్లి అసలు విషయాన్ని కనుక్కోవాలని ఆదేశించారు. అసలు గ్రామంలో నిమజ్జనమే లేదని తేలడంతో డీఈఓ ఆ పాఠశాల హెచ్ ఎంకు మెమో జారీ చేశారు. అంతకుముందే ప్రధానోపాధ్యాయుడికి, ఆ ఉపాధ్యాయురాలికి మధ్య వివాదాలు ఉండేవని స్థానికుల సమాచారం. దాంతోనే స్థానిక సెలవు వివాదం ఇంతవరకు దారి తీసిందని కొందరు చెబుతున్నారు. ఈ విషయమై హెచ్ఎం మెకటయ్యను వివరణ కోరగా, మంగళవారం కబడ్డీ పోటీలు నిర్వహించడం వల్ల రాత్రి అయ్యిందని, అలాగే గ్రామంలో వినాయక నిమజ్జనం ఉందని స్థానికులు చెప్పడంతోనే సెలవు ఇచ్చామని చెప్పుకొచ్చారు.



విద్యార్థులకు పాఠాలు చెప్తున్న ఉపాధ్యాయురాలు

సామూహిక సెలవుకు మద్దతు

టీడీగుట్ట (హన్వాడ): సీపీఎస్ రద్దుచేయాలని చేపట్టిన సామూహిక సెలవుకు మద్దతునిస్తున్నట్లు ఇంగ్లీష్ టీచర్ల సంఘం రాష్ట్ర కన్వీనర్ నాగం రఘురాంరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని ఈసందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమాలతో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



మహబూబ్‌నగర్

తిరుమల	జయ జానకీ నాయక
బాలాజీ	అర్జున్ రెడ్డి
వెంకటాద్రి	ఫిదా
వెంకటేశ్వర గోల్డ్	నేనే రాజు నేనే మంత్రి
శ్రీనివాస	ఆనందోబ్రహ్మ
మహేశ్వరి	లై
శ్రీకృష్ణ	జెంటిల్‌మెన్

పాఠశాలల్లో మౌలిక వసతులు ఉండాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం: అన్ని మండలాల్లో స్వచ్ఛ పాఠశాలలను ఎంపిక చేశామని, మౌలిక వసతులు ఏర్పాటు చేసుకోవాలని హెచ్ఎంలకు డీఈఓ సోమిరెడ్డి సూచించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని టీఎస్ఎస్ఏ మీటింగ్‌హాల్‌లో 26మండలాల్లో ఎంపికైనా 64పాఠశాలలకు సంబంధించి స్వచ్ఛపాఠశాలలో ఎలాంటి వసతులు ఉండాలనే విషయాలను డీఈఓ వివరించారు. పాఠశాలల్లో తప్పనిసరిగా టాయిలెట్స్, పరిసరాల పరిశుభ్రత పాటించేలా చూడాలని, పాఠశాలల్లో మొక్కలు నాటించాలని సూచించారు. సమావేశంలో ఏఎంఓ హేమచంద్రుడు, ఐఈడీ అధికారి చంద్రశేఖర్, ఎంపికైన స్వచ్ఛపాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

4న జిల్లాస్థాయి కళా ఉత్సవం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో 4న జిల్లాస్థాయి కళాఉత్సవాలు నిర్వహించనున్నట్లు డీఈఓ సోమిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల, జూనియర్‌కళాశాల్లో చదువుతూ నృత్యం, సంగీతం, రంగస్థల ప్రదర్శనలు, దృశ్య కళలపై ఆసక్తి గల విద్యార్థులుఉత్సవాల్లో పాల్గొనేందుకు పేర్లను డీఈఓ కార్యాలయం, తమ పాఠశాలల్లో నమోదుచేసుకోవాలని ఆయన సూచించారు.

పాల ఉత్పత్తిదారులకు అవగాహన సదస్సు

బండమీదిపల్లి(వీరన్నపేట): పట్టణంలోని బండమీదిపల్లి పాలశీతలీకరణ కేంద్రం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం సభ్యులకు బుధవారం ఒక రోజు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. పాలఉత్పత్తి, మార్కెటింగ్ పాల ధర వంటి విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ కో ఆపరేట్యూవ్ డిప్యూటీ డైరెక్టర్ మల్లికార్జున్, ప్రిన్సిపాల్ బూక్యవెంకన్న, రాజ్‌కుమార్, సురేష్ పాల్గొన్నారు.

'పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం: ఉద్యోగ ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని బీటీఏ జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 1న సీపీఎస్‌కు వ్యతిరేకంగా చేపట్టే నూతన ర్యాలీ, ధర్నాల్లో ఉద్యోగ ఉపాధ్యాయులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'ధర్మ దీక్షలో పాల్గొనాలి'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం: ఉద్యోగ ఉపాధ్యాయులు సెప్టెంబర్ 1న సామూహికసెలవు పెట్టి ధర్మదీక్షలో పాల్గొనాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీం జిల్లా అధ్యక్షుడు సనాతన బాలస్వామి పిలుపునిచ్చారు. బుధవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధర్మదీక్షను పట్టణంలోని టీటీడీకల్యాణ మండపం ముందు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులందరు ధర్మదీక్షలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సామూహిక సెలవు పత్రాన్ని జేసీకి ఇచ్చిన ఉద్యోగులు



జేసీ శివకుమార్‌నాయుడికి వినతిపత్రాన్ని ఇస్తున్న ఉద్యోగులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్: కలెక్టరేట్ ఉద్యోగులు సెప్టెంబర్ 1న సామూహిక సెలవును కోరుతూ ట్రెస్సా జిల్లా అధ్యక్షుడు చెన్నకిష్టయ్య, అసోసియేటెడ్ అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ కె.శివకుమార్‌నాయుడికి సెలవుపత్రాన్ని అందించారు. అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలంటూ సెప్టెంబర్ 1న నిరసనకు దిగారు. ఉద్యోగ సంఘాల నాయకులు కలెక్టరేట్ ముట్టడి తలపెట్టారు. ఇందులో పాల్గొనేందుకు సెలవును కోరుతూ పత్రాన్ని జేసీకి ఇచ్చారు.

10న సాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణ

● పోస్టర్‌ను విడుదల చేసిన మంత్రులు

టీడీగుట్ట (హన్వాడ): ఈ నెల 10న నర్వ మండల కేంద్రంలో సాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం జెడ్పీ కార్యాలయంలో మంత్రులు లక్ష్మారెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు పలువురు విడుదల చేశారు. ఐలమ్మ 32వ వర్ధంతిని పురస్కరించుకుని విగ్రహా ఆవిష్కరణ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

గణేష్‌నగర్‌లో అన్నీ సమస్యలే

● అధ్వానంగా అంతర్గత రోడ్లు
● డ్రైనేజీలు లేక ఇబ్బందులు
● పడకేసిన పారిశుధ్యం



గతుకులమయంగా ఉన్న అంతర్గత రోడ్డు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు మర్లు ప్రాంతంలోని గణేష్‌నగర్ కాలనీలో సమస్యలు తాండవిస్తున్నాయి. గతంలో కాలనీ క్రిస్టియన్ పల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉండేది.నాలుగేళ్ల క్రితం మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలో విలీనమైంది. కానీ ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా సమస్యలు ఉన్నాయి. మంచినీటి సమస్య, డ్రైనేజీ, అంతర్గత రోడ్లు సరిగ్గా లేకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో తాగునీటి కోసం మున్సిపల్ నిధులతో బోరు వేయించారు. ఒక్క బోరు నీటినే అవసరాలకు వాడుకుంటున్నామని కాలనీవాసులు అంటున్నారు. కనీసం అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు సరిగ్గా లేవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో పనులను అడిగితేనే చేస్తారా అని ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. ఎమ్మిదినెలల క్రితం కాలనీలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధాఅమర్, వార్డు కౌన్సిలర్ మహమూద్‌అలీ, అధికారులు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి పరిష్కారం చూపలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



ఇళ్ల మధ్య పెరిగిన ముళ్లపొదలు

సీసీరోడ్లు లేక ఇబ్బందిగా ఉంది



గణేష్‌నగర్ కాలనీలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టాలని కౌన్సిలర్ దృష్టికి తీసుకువచ్చాం. ఇప్పటి వరకు చేపట్టలేదు.కాలనీ అభివృద్ధికి మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి.

– కృష్ణారెడ్డి, కాలనీవాసి

● చినుకుపడితే చిత్తడే



కాలనీలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. సీసీ రోడ్లు లేక పోవడంతో చిన్నపాటి వర్షానికే రోడ్లన్ని చిత్తడిగా మారుతున్నాయి. దీంతో పాటు డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై పారుతుంది. దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలి.

– డాక్టర్ రాజేందర్, కాలనీ కమిటీ ప్రధాన కార్యదర్శి

రామన్ పాదు నీటి సౌకర్యం కల్పించాలి



కాలనీలో మంచినీటి ఎద్దడి ఉంది. పవర్ బోరు వేయించారు. కానీ పూర్తిస్థాయిలో నీరు సరిపోవడం లేదు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాలనీవాసులకు సరిపడా నీరు అందించాలంటే రామన్ పాదు పైపులైన్ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– సత్యన్న, కాలనీవాసి

ఎస్సీఆర్‌పీఎస్ జెండావిష్కరణ

పాలమూరు: ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ అధ్యక్షుడు కర్నె శ్రీశైలం జెండాను బుధవారం జిల్లా కేంద్రంలో జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీశైలం, యాంకి రమేష్, డా.దేవేంద్రప్ప, కె.శాంతికుమార్‌లు మాట్లాడుతూ ఎస్సీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను ఉమ్మడి జిల్లాలో చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని పలుచోట్ల కమిటీలను వేసి దళితుల సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నట్లు తెలిపారు. నాయకులు సూగూరయ్య, కె.యాదయ్య, డి.రాములు, బి.వెంకటేష్, శ్రీను, శేఖర్, రఘు, గణేష్, యాదయ్య, నరసింహులు, శ్రీనివాసులు, తమ్మన్న,యాదగిరి పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న కర్నె శ్రీశైలం

'బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం: రాష్ట్రంలో నారాయణ, చైతన్య కళాశాలల్లో వారం రోజుల్లో నాలుగు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని, బాధిత విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శ్రీధర్ డిమాండ్ చేశారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో విద్యాశాఖమంత్రి కడియం శ్రీహరి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలపై ఉక్కుపాదం మోపుతామని చెప్పిన టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. విద్యార్థులు ఏ కారణం చేత ఆత్మహత్య చేసుకున్నారో కమిటీ వేసి నిజాలు వెలికి తీయాలన్నారు. ఏబీవీపీ నాయకులు శివ, లోకేష్, నవీన్ , నరేష్, మహేష్, రాము పాల్గొన్నారు.

కూరగాయల ధరలు



టమాట	40	క్యాప్సికమ్	48
వంకాయ	30	దొండకాయ	24
చిక్కుడు	30	దోస	20
పచ్చిమిర్చి	32	బీర్నీస్	40
బెండ	30	బీట్‌రూట్	40
బీరకాయ	30	సోరకాయ	16
కాకరకాయ	40	చామగడ్డ	40
చౌళకాయ	24	ఆలుగడ్డ	16
క్యాబేజీ	24	కీరదోస	30
క్యారెట్	70	ఉల్లిగడ్డ	30

ఆకుకూరలు

పాలకూర(రూ.5)కు	06 కట్టలు
పుంటికూర(రూ.5)కు	06
గంగవాయి(రూ.5)కు	06
తోటకూర(రూ.5)కు	06
మెంతికూర(రూ.5)కు	06
కోతిమీర(రూ.5)కు	03
పుదీన(రూ.5)కు	02

రైతు బజార్ కూరగాయల ధరలు (నేటి ఉదయం 8గంటల వరకు మాత్రమే)

విద్యుత్ అధికారుల నెంబర్లు

ఏఈ టౌన్-1	- 9440813457
ఏఈ టౌన్-2	- 8331044194
ఏఈ టౌన్-3	- 9440813459
ఆప్‌రేషన్ డీఈ మహబూబ్‌నగర్	- 9440813418
ఏడీఈ పట్టణం	- 9440813431
ఎస్ఈ కంట్రోల్‌రూమ్	- 9440768928
డీఈ ట్రాన్స్‌పార్మర్స్	- 9440813416
ఏడీఈ ట్రాన్స్‌పార్మర్స్	- 9440813425
ఏఈ ట్రాన్స్‌పార్మర్స్	- 9440813450
డీఈటీ	- 9440813415
ఎస్ఈ మహబూబ్‌నగర్	- 9440813414

హలో.. Hello Andhrajyothy ఆంధ్రజ్యోతి

మీ కాలనీల్లో సమస్యలు ఉన్నాయా.. పత్రికా ముఖంగా చెప్పాలనుకుంటున్నారా.. మాకు ఉప్పందించండి..

క్రైమ్, మున్సిపాలిటీ -	99859 21377
విద్యావిభాగం, క్రీడలు -	94411 41359
విద్యుత్, వ్యవసాయం -	94407 19916
వైద్యవిభాగం -	98888 16016
కలెక్టరేట్ -	92478 51278
జడ్పీసెంటర్, ఆర్టీసీ-	94417 40122
భగీరథకాలనీ -	94942 70180
పాలమూరు యూనివర్సిటీ -	81067 53804

మండల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

ధన్వాడ : మండలంలోని గోటూర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సారథ్యంలో ఒక్క రోజు నిర్వహించే మండల స్థాయి ఆటల పోటీలను ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పురుషోత్తం బుధవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక కోటా కింద ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అండర్-17, 14 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బాల్‌రాజ్, పీడీ గజానంద్, పీఈటీలు ఊసు రవి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, రహీం, నాగమణి, జ్యోతి, నరహరి పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథుడు

- ప్రత్యేక పూజలు చేసిన ప్రజాప్రతినిధులు,
- పటిష్టమైన బందోబస్తు మధ్య కదిలిన వినాయకులు
- పలు వసతులను ఏర్పాటుచేసిన అధికారులు
- తరలివచ్చిన పట్టణ ప్రజలు


బొజ్జగణపయ్యకు హారతి ఇస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు


గణపయ్యను వాహనంపైకి ఎక్కిస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ టౌన్/ న్యూటౌన్/ వీరన్నపేట/ భగీరథకాలనీ: వినాయక నిమజ్జనోత్సవం పట్టణంలో బుధవారం రాత్రి కన్నుల పండువగా సాగింది. ఈ సందర్భంగా తొలుత మంటపాల వద్ద స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి వివిధ వాహనాల్లో విగ్రహాలను ఉంచి పురవీధుల్లో ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలతో పాటు మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగులు చల్లుకుంటూ, నృత్యాలు చేసుకుంటూ ఊరేగింపు కొనసాగించారు.

ప్రధాన కూడలలో భారీ బందోబస్తు

పట్టణంలో వినాయకుల నిమజ్జనం సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గత ఏడాది జరిగిన సంఘటనలు, వివాదాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తుగా మసీదుల, ప్రధాన కూడళ్లలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. గడియారం చౌరస్తాలో ట్రాఫిక్ జామ్ కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

● వినాయకుల నిమజ్జనాన్ని పురస్కరించుకుని బుధవారం ఉదయం నుంచే వైన్ షాపులను మూసి ఉంచారు.

● పట్టణంలోని మర్లు గణేష్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డును వేలం వేయగా రూ. 12,500లకు కిషన్ అనే భక్తుడు కొనుగోలు చేశారు.

● భగీరథ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.


ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్ స్టెపులు


నృత్యం చేస్తున్న చిన్నారులు


వేదికపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్


ప్రత్యేక పూజలో పాల్గొన్న కాలనీ భగీరథకాలనీ కౌన్సిలర్ పాండురంగారెడ్డి, యువకులు, మహిళలు


డోలు కొడుతున్న పద్మజారెడ్డి


వందన అపార్ట్‌మెంట్‌లో పూజలందుకుంటున్న గణపయ్య


నృత్యం చేస్తున్న భక్తులు


మోగుతున్న డోలు


కళాకారుల ఆటా పాట

ఎన్నికల కేంద్రాలను పరిశీలించిన డీసీఎల్


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

పాలమూరు: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని విద్యుత్ శాఖలోని టీఎస్ ఎస్‌పీడీసీఎల్, జెన్ కో, ట్రాన్స్‌కోలో పనిచేసే 1397మంది ఉద్యోగులు సెప్టెంబర్ 8న గుర్తింపు సంఘాన్ని ఎన్నుకునేందుకు ఓటువేయనున్నారు. అందుకు సంబంధించిన పోలింగ్ కేంద్రాలను బుధవారం మక్తల్, కొడంగల్, ఆమన్‌గల్, షాద్‌నగర్ ప్రాంతాల్లో డిప్యూటి కమిషనర్ ఆఫ్ లేబర్(డీసీఎల్), ఎన్నికల రిటర్నింగ్ అధికారి అబ్దుల్ సయీద్, సూపరిన్‌టెండెంట్ షఫియోద్దీన్‌లు పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 18పోలింగ్ బూతులను ఏర్పాటు చేస్తున్నట్లు వారు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పరిస్థితులు ఎలా ఉన్నాయో పరిశీలించామన్నారు. ఎన్నికలు నిర్వహించేందుకు సరిపడా గదులు, ఇతర సౌకర్యాలు ఉన్నది, లేనిది క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. ఎన్నికలను 8వ తేదీ ఉదయం 8నుంచి సాయంత్రం 6గంటల వరకు నిర్వహించి, అదేరోజు లెక్కింపు ఉంటుందని తెలిపారు.

వినాయకుడికి పూజ చేసిన చైర్‌పర్సన్


వినాయకుడికి పూజలు చేస్తున్న చైర్‌పర్సన్ రాధ, కౌన్సిలర్ లింగమయ్య

బండమీదిపల్లి, (వీరన్నపేట): పట్టణంలోని బండమీదిపల్లి జంగాలగేరిలో హిందూ శివసేన గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకునికి మున్సిపల్ చైర్‌పర్సన్ రాధాఅమర్, కౌన్సిలర్ వి.లింగమయ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రాధ మాట్లాడారు. కార్యక్రమంలో హిందూ శివసేన గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పవన్ , కృష్ణ, లింగప్ప, యాదయ్య, ఆంజనేయులు, రాంచంద్రయ్య, యాదమ్మ పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరిస్తా : ఎంపీ

నారాయణపేట టౌన్ : మారుతి కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరిస్తానని ఎంపీ జితేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. పట్టణంలోని భీమండి కాలనీలో గల హనుమాన్ దేవాలయం వద్ద యువజన సంఘం వారు ప్రతిష్ఠించిన వినాయకుడికి మంగళవారం రాత్రి ఎంపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీవాసులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.

హామీలను నెరవేర్చాలి

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ

బల్మూర్: టీఆర్ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆయన బుధవారం మండలంలోని పొలిశెట్టిపల్లి గ్రామంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రజలు అభివృద్ధికి దూరమైయ్యారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఎప్పటికప్పుడు మరిచిపోతున్నారని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, ఎస్సీలకు 3 ఎకరాలు, డబుల్‌బెడ్‌రూం ఇలా అనేక హామీలు ఇస్తూ కాలం వెల్లదీస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వం చేసే పనులను కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని అధికార పార్టీ నాయకులు వాదిస్తున్నారని, వారు హామీలు ఇస్తున్న పనులు ఎక్కడ జరుగుతున్నాయో తెలపాలని కార్యకర్తలు నిలదీస్తుంటే దానికి అడ్డుకుంటున్నారనే సాకును తెస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీపతిరావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ విష్ణుమూర్తి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నర్సింహరావు, సుధాకర్‌గౌడ్, నిరంజన్‌గౌడ్, ఖదీర్, షేకర్‌రెడ్డి, మండల యూత్ నాయకుడు లక్ష్మయ్య, రేణయ్య, పరమేశ్వర్, బాలస్వామి, వెంకట్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూసర్వేపై

ప్రభుత్వ విధానాలు ప్రకటించాలి

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొమ్ము భరత్

నాగర్‌కర్నూల్ అర్బన్: సమగ్ర భూసర్వేకు సంబంధించిన ప్రభుత్వం విధివిధానాలపై తన నిర్ణయాలను ప్రకటించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొమ్ము భరత్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ప్రజాసంఘాల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రుణమాఫీ ఒకేసారి చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి విడతల వారీగా కూడా హామీని నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకున్న దాదాపు 2వేల రైతు కుటుంబాలకు ఆర్థిక సాయం అందించకుండా మోసం చేశారన్నారు. ఎకరాకు 4వేల రూపాయలు ఉచితంగా ఇచ్చేందుకు సరికొత్త పథకాన్ని రచించిన ముఖ్యమంత్రి సమగ్ర భూసర్వే చేయడానికి ఆదేశాలు ఇవ్వడం లేదన్నారు. రైతుకు గిట్టుబాటు ధర కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. మూడేళ్లు దాటిన పాలనలో కేసీఆర్ సాధించిన అభివృ ద్ధి శూన్యమని ఎద్దేవా చేశారు. ఎన్నికలు సమీపించేలోపు హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చెన్నదాసు, స్వామి, లక్ష్మణ్, కృష్ణ, ఎర్రమశన్న, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని విస్మరించిన ప్రభుత్వం

అచ్చంపేట: విద్యా రంగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సైదులు తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రగతి కళాశాలలో కమిటి ఎన్నిక సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంటును తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జావేద్, శ్రీరాంసింగ్, పట్టణ కార్యదర్శి నవీన్, మండల ఉపాధ్యక్షుడు రాంసింగ్, రవీందర్, మౌనిక, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అర్హత లేని టీచర్లతో బోధిస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

నాగర్‌కర్నూల్ టౌన్: జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో అర్హతలేని టీచర్లతో భోధనలందిస్తూ విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటున్నారని అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జి.అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవేటు పాఠశాలలో ఎక్కువ వేతనం ఇవ్వాల్సి వస్తోందని తక్కువ వేతనంకు పనిచేసే అనర్హులను టీచర్లుగా నియమిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శేఖర్, బాల్‌రాజ్, సాయి, శివ, కుర్మయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి

● జడ్పీచైర్మన్ బండారి భాస్కర్



రైతులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా అధికారులు

ఆంధ్రజ్యోతి, గద్వాల: రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని జడ్పీచైర్మన్ బండారి భాస్కర్ అన్నారు. బుధవారం గద్వాల వ్యవసాయమార్కెట్ యార్డులో వ్యవసాయం రైతు సంక్షేమంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నీటి బిందువును ఉపయోగించడమే మన ఉద్దేశ్యమన్నారు. ఏళ్ల తరబడి పూర్తి కాని భారీ, మధ్యతరహా, నీటిపారుదల ప్రాజెక్టులను త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఆర్గానిక్ వ్యవసాయానికి కూడా మొట్టమొదటిసారి ఒక ప్రణాళికను ప్రారంభించారని వేప పూసిన యూరియా ద్వారా అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. దీంతో ఉత్పాదన వ్యయం తగ్గి ఆదాయం వృద్ధి చెందుతుందన్నారు. సీతల గిడ్డంగులు ఏర్పాటు చేసి పంట పండిన తర్వాత జరిగే నష్టం తగ్గిస్తున్నట్లు తెలిపారు. గద్వాల మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ బండ్ల లక్ష్మీదేవి మాట్లాడుతూ ఆహారపదార్థాల ప్రాసెసింగ్‌కు ఉన్న ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని కిసాన్ సంపద పథకం ప్రారంభించామని వివరించారు. దీంతో పెద్దఎత్తున ప్రాసెసింగ్‌కు అవసరమైన మౌలికసదుపాయాలను సీతల గిడ్డంగులు స్థాపిస్తున్నట్లు తెలిపారు.

అలంపూర్ మార్కెట్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మార్కెట్‌యార్డుల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఆన్‌లైన్ ఎలక్ట్రానిక్ మార్కెట్ ప్లాట్‌ఫాంను ఏర్పాటు చేశామన్నారు. దళారుల పాత్రను పూర్తిగా తగ్గించి పంట ధరలలో అధిక శాతం రైతులకు ఇచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. రైతులను ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ రూపంలో సంఘటిత పరుస్తున్నట్లు దీని వల్ల వారి ఆర్థిక స్థాయి పెరగడంతో పాటు వ్యాపారులతో బేరసారాలు సాగించే శక్తి కూడా పెరుగుతుందన్నారు. అనంతరం వ్యవసాయాధికారులు, రైతులతో ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ నాయక్, జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ అధికారి సోమిరెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీసూర్యప్రకాష్, జిల్లా మార్కెట్ శాఖ అధికారి పుష్పమ్మ, మత్స్యశాఖ అధికారి మధుసూదన్, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాల సందర్భంగా ఫలకల భజన



చందాపూర్‌లో ఫలకల భజన చేస్తున్న దృశ్యం

వనపర్తి వ్యవసాయం: వనపర్తి మండలం చందాపూర్ గ్రామంలోని హనుమాన్‌కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఉమ్మడి జిల్లాస్థాయి ఫలకల భజన పోటీలు నిర్వహించారు. పోటీలు వివిధ గ్రామాల నుంచి ఫలకల జట్లు పాల్గొన్నాయి. సల్కలాపురం-మంగనూరు జట్టు మొదటి బహుమతి పొంది రూ. 5,116 గెలుపొందగా, పాన్‌గల్ మండలం రాయినిపల్లి గ్రామానికి చెందిన జట్టు ద్వితీయ బహుమతితో రూ. 4,116, పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామానికి చెందిన జట్టు తృతీయ స్థానంతో రూ. 3,116లు గెలుపొందాయి. కాగా గురువారం వినాయక భక్త బృందం అన్నదానం చేయనున్నట్లు తెలిపారు.అలాగే రాత్రికి సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. అలాగే జిల్లా కేంద్రంలోని 22వ వార్డు ఆర్టీసీ కాలనీలో నెలకొల్పిన వినాయకుడి లడ్డూ వేలం నిర్వహించారు. కాలనీకి చెందిన టీఆర్ఎస్ నాయకుడు ప్రేమ్‌నాథ్‌రెడ్డి రూ.72 వేలు పాడి లడ్డును సొంతం చేసుకున్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో

కరెంటు లేక రోగుల ఇక్కట్లు

కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో బుధవారం మధ్యాహ్నం నుంచి కరెంటు లేకపోవడంతో రోగులు బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అధికారులు ముందు చూపు లేకపోవడంతో రాత్రైనా కరెంటు లేకపోవడం వల్ల రోగులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ఆసుపత్రిలోనే ఇలాంటి పరిస్థితి ఉంటే మండల స్థాయిలో ఉండే ఆసుపత్రిల్లో ఇంకెలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఇలాంటి పరిస్థితి మరోసారి పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ఆసుపత్రులకు కరెంటు అంతరాయం లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాజెక్టుల పనులను

ఓర్వలేకనే విమర్శలు



మాట్లాడుతున్న జక్కా రఘునందన్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో కొనసాగుతున్న ప్రాజెక్టు పనులను ఓర్వ లేక విపక్షాలు టీఆర్ఎస్ ప్రభుత్వంపై లేనిపోని విమర్శలు చేస్తున్నాయని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు జక్కా రఘునందన్‌రెడ్డి విమర్శించారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో భీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, మహాత్మాగాంధీ ఎత్తి పోతల పథకం పనులు వేగవంతమయ్యాయన్నారు. నియోజకవర్గానికి లక్ష ఎకరాల చొప్పున సాగునీరందించి తెలంగాణ రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ పని చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని సుదీర్ఘకాలం పాటు పాలించిన కాంగ్రెస్, టీడీపీలు తమ హయాంలో ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేకపోయాయో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో పనులు జరగడం లేదంటూ ప్రస్తావించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విలేకరుల సమావేశంలో మార్కెట్ చైర్మన్X వెంకటయ్య, టీఆర్ఎస్ నాయకులు దొడ్ల ఈశ్వర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ ఉన్నారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

బిజినేపల్లి: అక్రమంగా తరలిస్తున్న పశువులను మంగనూరు గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. హైదరాబాద్‌లోని మారాపూర్‌కు చెందిన ఖాజాపాషా అనే వ్యక్తి కొల్లాపూర్ ప్రాంతంలో కొనుగోలు చేసిన పశువులను బుధవారం డీసీఎం వ్యాన్‌లో తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న మంగనూరు గ్రామస్థులు జగదీశ్వర్‌రెడ్డి, మల్లికార్జున్, శ్రీనివాస్‌రెడ్డి, రాములు మరికొందరు డీసీఎంను వ్యాన్‌ను అడ్డుకొని పోలీసులకు సమాచారం అందించారు. డీసీఎం వ్యాన్‌లో 18 పశువులున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ విషయంపై ఖాజాపాషాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రదీప్‌కుమార్ తెలపారు. పశువులను నాగర్‌కర్నూల్ గోశాలలో వదిలేస్తామని ఎస్సై తెలిపారు.



పశువులను పోలీసులకు అప్పగిస్తున్న గ్రామస్థులు

జూనియర్ కళాశాలను తరలించొద్దు

అమ్రాబాద్: మన్ననూర్ గ్రామంలోని మద్దిమడుగు రహదారి పక్కన ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలను తరలించే ఆలోచనను విరమించుకోవాలని ఉమ్మడి జిల్లా చెంచు సేవా సంఘం అధ్యక్షుడు దాసరి నాగయ్య అన్నారు. మన్ననూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ నల్లమల ప్రాంతంలోని వెనకబడిన జాతుల కోసం ఏర్పాటు చేసిన ఆదిమజాతి జూనియర్ కళాశాలను తరలించడం విచారకరమన్నారు. గత మూడు సంవత్సరాల క్రితం నాబార్డు నిధులు రూ. 140 లక్షలతో నిర్మాణం చేపట్టిన కళాశాలను తరలిస్తే ఈ ప్రాంత చెంచులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు పెద్దిరాజు, తదితరులు ఉన్నారు.

బైబై గణేశా..



జడ్చర్ల కేకేనగర్‌లో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడి ముందు కోలాటం ఆడుతున్న కాలనీవాసులు

- ఘనంగా వినాయక నిమజ్జనం
- విద్యానగర్ కాలనీలో 1లక్ష 8వేలు పలికిన గణనాథుడి లడ్డు

జడ్చర్ల అర్బన్: నిత్యపూజలు అందుకున్న గణనాథుడి నిమజ్జన ఉత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. గత ఐదురోజులుగా మండపాల్లో గణనాథున్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించిన నిర్వాహకులు చివరిరోజు ప్రత్యేక పూజలు, అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అధిక మండపాల వద్ద ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. అదేవిధంగా లడ్డువేలం పాటలను జోరుగా నిర్వహించారు.

భారీ ర్యాలీ : బాదేపల్లి, జడ్చర్ల, కావేరమ్మపేట గ్రామాల్లో బుధవారం సాయంత్రం 6గంటల నుంచి వినాయక విగ్రహాల ఊరేగింపు మేళతాళాల మధ్య భారీ ఊరేగింపుతో ప్రారంభమైంది. పట్టణంలోని పురవీధుల గుండా వినాయక ప్రతిమలను ఊరేగించారు. నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణనాథులకు స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. వీహెచ్‌పీ, వినాయక నిమర్జన ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకులకు స్వాగతం పలికారు. యువకులు, నిర్వాహకులు, పట్టణ ప్రజలు నృత్యాలు చేశారు. నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథులను తిలకించడానికి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు.

లడ్డూల వేలం : వినాయక మండపాల వద్ద బుధవారం లడ్డూ వేలం కార్యక్రమాన్ని నిర్వాహకులు ప్రత్యేకంగా నిర్వహించారు. పద్మావతి కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద నిర్వహించిన వేలంపాటలో బాదేపల్లి హర్షిత్‌బాబు రూ.54వేలు పాటపాడి లడ్డూను దక్కించుకున్నారు. అలాగే, విద్యానగర్‌కాలనీలో లక్షా 8వేలకు వినోద్‌గౌడ్ లడ్డూను దక్కించుకున్నాడు. అదేవిధంగా పలు కాలనీల్లో లడ్డూను ఆయా కాలనీవాసులు దక్కించుకున్నారు.

బాలానగర్‌లో : మండల కేంద్రంలో గణేష్ నిమజ్జనోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. దుర్గాభవానీ ఆరెకటిక సంఘం నాయకులు, కార్యకర్తలు భక్తిశ్రద్ధలతో భజన కీర్తనలు, గేయాలు ఆలపిస్తూ నృత్యాలు చేశారు. అందంగా అలంకరించిన వాహనాలపై విగ్రహాలను ఊరేగించారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి పేపర్ ఏజెంట్ చిన్నప్ప, సంఘం నాయకులు శ్రీనివాస్, సర్వోజి, మల్లేష్, వినోద్, రమేష్, కృష్ణ, హరికృష్ణ, నాగేష్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్లలో వినాయక నిమజ్జన కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి

ఆది దేవుడి ఆశీస్సులతో బంగారు తెలంగాణ వైపు సాగుదాం

- జడ్చర్లలో వినాయక నిమజ్జన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి

జడ్చర్ల : ఆదిదేవుడు ఆశీస్సులతో పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ దిశగా ముందుకు సాగుదామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. జడ్చర్లలోని నేతాజీచౌరస్తాలో వీహెచ్‌పీ, వినాయక నిమజ్జన ఉత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వినాయక నిమజ్జన కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. తెలంగాణ రాష్ట్రంలోనే పండుగలకు ప్రాధాన్యత పెరిగిందని, రాష్ట్ర ప్రభుత్వం సైతం పండుగలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఆయన వినాయక ప్రతిమలకు పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



జడ్చర్లలో వినాయక నిమజ్జనంలో నృత్యం చేస్తున్న యువకులు



బాలానగర్‌లో భక్తిపాటలతో నృత్యాలలో పాల్గొన్న దుర్గాభవానీ ఆరెకటిక సంఘం నాయకులు



జడ్చర్ల మండలంలోని నాగసాల వద్ద చెరువులో వినాయకుడిని నిమజ్జనం చేస్తున్న నిర్వాహకులు

● ఇంటర్వ్యూ

శాంతి భద్రతలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

- రాజాపూర్ ఎస్సై మల్లారెడ్డి



రాజాపూర్: వినాయక నిమర్జన కార్యక్రమంలో శాంతిభద్రతల పరిరక్షణను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఎస్సై మల్లారెడ్డి తెలిపారు.

వినాయక మండపాల దగ్గర మీరు తీసుకుంటున్న జాగ్రత్తలు ఏమిటి.?

ప్రతిరోజు మా సిబ్బంది మండపాల వద్దకు వెళ్లి అక్కడ ఏర్పాటుచేసిన పాయింట్ బుక్స్‌లో సంతకాలు చేసి కమిటీ సభ్యులకు సహకరించాలని చెబుతున్నారు.

సోమవారంతపు సంతలో జరుగుతున్న చోరీలు, ట్రాఫిక్ నియంత్రణకు మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

పెట్రోలింగ్ చేపడుతున్నాం. సిబ్బంది ఎక్కువగా లేని కారణంగా వారాంతపు సంతలో ట్రాఫిక్‌కు కాస్త ఇబ్బందిగా ఉంది. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుం టున్నాం.

పండుగల సందర్భంగా ప్రజలకు మీరు ఇచ్చే సూచనలు ఏమిటి.?

ప్రజలంతా స్నేహభావంతో కలిసిమెలిసి ఉండాలి. గొడవలు జరుగకుండా ఒకరికొకరు సహకరించుకుంటూ శాంతిభద్రతలను కాపాడాలి.

చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారా.?

పోలీస్, న్యాయశాఖ ఆధ్వర్యంలో చట్టాలపై న్యాయమూర్తులచేత అవగాహన కల్పించడం జరిగింది. అదేవిధంగా జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవగాహన కల్పిస్తూ చర్యలు తీసుకుంటున్నాం.



జడ్చర్లలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

విద్యార్థుల ఆత్మహత్యలకు నిరసనగా

ఉపముఖ్యమంత్రి దిష్టిబొమ్మ దహనం

జడ్చర్ల: కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలకు నిరసనగా బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పరిషత్X భాగ్ కన్వీనర్ సుదర్శన్ మాట్లాడుతూ నారాయణ శ్రీచైతన్య కళాశాలలో వారంరోజుల వ్యవధిలో నలుగురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడితే రాష్ట్ర ప్రభుత్వం ఆ కళాశాలపై కనీస చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా కళాశాలలో జరుగుతున్న ఆత్మహత్యలపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు నరేశ్, శివ, శ్రీకాంత్, గోపాల్, శశిధర్, నవీన్, పవన్, అజయ్, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

రైతుకు వ్యతిరేకమా.. అనుకూలమా

- జడ్చర్లలో అఖిలపక్షం ధర్నా.. దయ్యాలు వేదాలు వల్లించినట్లుంది
- మాజీ ఎంపీపీ మాడెమోని నర్సింహులు, ఎంపీపీ శ్రీనివాస్

నవాబ్‌పేట: తెలంగాణలో రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని టీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు చేపడుతోందని టీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ మాడెమోని నర్సింహులు, ఎంపీపీ శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఇతర పార్టీల నాయకులు స్థాయి మరిచి రైతుల నోట్లో మట్టికొట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని, అసలు కాంగ్రెస్ పార్టీ రైతుకు వ్యతిరేకమా.. అనుకూలమా తన వైఖరిని స్పష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. పాలమూరు ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉదండాపూర్ గ్రామంలో చేపడుతున్న రిజర్వాయర్ పనులను రైతుకు పరిహారం ఇవ్వాలన్న పేరుతో కాంగ్రెస్ పార్టీ, ఇతర అఖిలపక్ష నాయకులు, ప్రజాసంఘాల నాయకులు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులకు పరిహారం తగ్గినట్లయితే ఉదండపూర్, ఇతర ప్రాంతాల రైతులు రిజర్వాయర్‌కు భూములు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్నించారు. రిజర్వాయర్లు పూర్తయితే జడ్చర్ల నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీలకు పుట్టగతులు ఉండవనే భయంతో తమ పబ్బం గడుపుకునేందుకు కుట్రలు, కుతంత్రాలు చేస్తూ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం పాలమూరు జిల్లాలో చేపడుతున్న ప్రాజెక్టులను మూలన పడవేసి ఆంధ్రకు తరలిస్తే ప్రశ్నించని జిల్లా నాయకులు ఇప్పుడు ధర్నాలు చేయడం చూస్తుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లున్నాయని, ఇప్పటికైనా పసలేని ధర్నాలు మానుకోవాలని సూచించారు. సమావేశంలో మండల నాయకులు యాదిరెడ్డి, సంజీవరెడ్డి, వెంకటయ్య తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాడెమోని నర్సింహులు, శ్రీనివాస్

రేపు టీమాస్ ఫోరం సమావేశం

జడ్చర్లఅర్బన్: సామాజిక ప్రజా సంఘాల ఐక్యవేదిక(టీమాస్) ఫోరం సన్నాహక సమావేశాన్ని సెప్టెంబర్1న పట్టణంలోని టీఎన్జీఓ భవనంలో నిర్వహించనున్నట్లు కేవీపీఎస్ జిల్లా సహాయ కార్యదర్శి జగన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి జిల్లా చైర్మన్ జలజం సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థి, ఉపాధ్యాయ, కుల, సామాజిక, కార్మిక సంఘాలు హాజరుకావాలని ఆయన కోరారు.

వచ్చేనెల 4, 6న మండల స్థాయి పోటీలు

జడ్చర్ల: మండల స్థాయి పాఠశాలల అండర్-14, అండర్-17 క్రీడా పోటీలను సెప్టెంబర్4న, 6న మండలంలోని కోడ్గల్ జడ్పీహెచ్‌ఎస్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ మంజులాదేవి, ఎస్జీఎఫ్ కన్వీనర్ మెర్సిఫ్రెంచ్‌లు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడాంశాలలో బాల, బాలికలకు పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అండర్-17 విభాగంలో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2001 జనవరి 1వ తేదీ అనంతరం పుట్టిన వారై ఉండాలని, అండర్-14 విభాగంలో 6,7,8వ తరగతి విద్యార్థులు 2004 జనవరి 1 అనంతరం పుట్టిన వారై ఉండాలని వివరించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని వారు సూచించారు.

టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ

చిన్నచింతకుంట: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని సెప్టెంబర్ 1న చేపట్టిన నిరసనను జయప్రదం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సంబంధిత గోడ పత్రికను ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ ఆవిష్కరించారు. టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు భాస్కర్, జయంతి, పుష్పలత, గోపాల్,అమృతమ్మ పాల్గొన్నారు.

మినీ ఇంటర్వ్యూ

ఆదర్శ గ్రామమే మా లక్ష్యం

● సర్పంచ్ శ్రీదేవి



దేవరకద్ర: మండలంలోని నాగారం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని సర్పంచ్ శ్రీదేవి అన్నారు.

గ్రామాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

గ్రామంలోని ఉన్న సమస్యలను గుర్తించి ఒక్కొక్కటి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నా.

గ్రామ పారిశుధ్య పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

గ్రామంలోని డ్రైనేజీ, అంతర్గత రోడ్ల నిర్మాణం, మురుగుకాల్వల పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందుతున్నాయా?

ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవడమే కాకుండా పథకాల సద్వినియోగంపై గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రభుత్వం నుంచి గ్రామాభివృద్ధి కోసం ఏం ఆశిస్తున్నారు?

గ్రామ సంక్షేమం కోసం హాస్టల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాను.

కలుపు మొక్కల నివారణపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

మదిగట్ల(భూత్పూర్): వయ్యారి భామ కలుపు మొక్కల నివారణపై ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. బుధవారం మండలంలోని మదిగట్ల గ్రామంలో వ్యవసాయ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వయ్యారిభామ కలుపు మొక్కలు ఉండడం వల్ల పంటల ఎదుగుదల తగ్గిపోతుందని, మనుషులకు, జంతువులకు చర్మ, శ్వాస సంబంధ వ్యాధులు వ్యాపిస్తాయని దీన్ని పూర్తిగా నిర్మూలించి పశువుల పేడతో ఎరువులుగా మార్చుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి, బీజేపీ కన్వీనర్ రవీందర్‌రెడ్డి, వ్యవసాయ విద్యార్థులు సువర్ణ, సౌమ్య, కావ్య, కళ్యాణి, సౌజన్య, అశ్లేష, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమరవీరుల స్థూపం వద్ద బీజేపీ నాయకుల నివాళి

చిన్నచింతకుంట: సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ నేతృత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన తలపెట్టిన యాత్రలో భాగంగా సెప్టెంబర్ 7న మండలంలోని అప్పంపల్లి గ్రామంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా బుధవారం బహిరంగ సభ స్థలాన్ని వారు పరిశీలించారు. అనంతరం అప్పంపల్లి అమరవీరుల స్థూపం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షురాలు పద్మజారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగాపూర్ దరెడ్డి, బాల్‌రాజు, సుదర్శన్ రెడ్డి, ఓబీసీ రాష్ట్ర నాయకుడు ఎగ్గని నర్సింహులు, నంబిరాజు, రవీందర్‌రెడ్డి, జిల్లా నాయకులు కుర్వరమేష్, సుదర్శన్ గౌడ్ తదితరులు స్థూపం వద్ద నివాళ్లు అర్పించారు.

పోతులమడుగులో వినాయక నిమర్జన వేడుకలు



వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

భూత్పూర్: మండలంలోని పోతులమడుగు గ్రామంలో బుధవారం వినాయక నిమర్జన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అడుగుల భజన, నృత్యాలతో కన్నుల పండుగగా నిమర్జన వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, ఎంపీటీసీ రమేష్‌చందర్ పాల్గొన్నారు.

వెంకటేశ్వర్‌రెడ్డి సేవలు మరువలేనివి

భూత్పూర్: మండలంలోని కప్పెట గ్రామానికి చెందిన యూపీఎస్ పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్‌రెడ్డి బుధవారం పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ సుకన్య, జడ్పీటీసీ చంద్రమౌళి మాట్లాడుతూ వెంకటేశ్వర్‌రెడ్డి ఉపాధ్యాయ వృత్తిలో ఎనలేని సేవలందించారని, ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ హన్మంతు, హెచ్ఎంలు మురళీకృష్ణ, బాలవర్ధన్, పీఆర్‌టీయూ నాయకుడు బాల్‌రాజ్‌గౌడ్, గోవర్ధన్ రెడ్డి, రాజశేఖర్‌గౌడ్, ఎంపీటీసీ నర్సింహులు, నారాయణగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, బచ్చన్న, అహ్మద్ ఉన్నారు.

మట్టి రోడ్డు కాదు బీటీరోడ్డు

● భారీ వాహనాలతో గోతులు పడిన కర్వెన బీటీ రహదారి



కొత్తూర్ పెద్దతండా వద్ద గుంతలు పడిన బీటీ రోడ్డు

భూత్పూర్: మండలంలోని కర్వెన గ్రామ శివారులో నిర్మిస్తున్న కర్వెన రిజర్వాయర్ పనులకు భారీ వాహనాలను వాడుతున్నారు. దీనితో మండలంలోని కర్వెనకు వెళ్లే బీటీ రోడ్డు గుంతలతో ప్రమాదకరంగా మారింది. కొత్త మొల్గర నుంచి జడ్చర్లకు వెళ్లే బీటీ రోడ్డు కొత్తూర్ పెద్దతండా, కొత్తూర్, తాటిపర్తి గ్రామం మీదుగా ఎన్‌హెచ్ 44 కలిసే రోడ్డు భారీ వాహనాల రాకపోకలతో అధ్వానంగా మారింది. ఈ రోడ్డు వెంబడి ప్రతి రోజు వందల సంఖ్యలో టిప్పులు - తరాస్ బండ్లు, మట్టి ఇతర సమాగ్రిని రిజర్వాయర్ నిర్మాణం కోసం నిత్యం ఈ రోడ్డు మీదుగా తరలించడంతో గుంతలు ఏర్పడి ప్రయాణికులకు తీవ్ర ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఎక్కడ గుంతలు ఉన్నాయో అర్థం కాని పరిస్థితిలో రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సిన పరిస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాల్లో తరలించే మట్టి ఈ రోడ్డుపై ఎక్కడ పడితే అక్కడ పడిపోవడంతో బీటీ రోడ్డే అయినప్పటికీ పూర్తిగా మట్టి రోడ్డును తలపిస్తుంది. వర్షం కురిసినప్పుడైతే ఇక ప్రయాణం నరకమే. ఇదిలా ఉంటే భూత్పూర్ నుంచి నాగర్ కర్నూల్‌కు వెళ్లే రోడ్డు కూడ భారీ వాహనాల తాకిడికి వెల్కిచర్ల, చౌలతండా దగ్గర గుంతలతో ప్రమాద భరితంగా మారింది. అక్కడ ఇటీవలే రోడ్డు ప్రమాదం కూడా చోటు చేసుకుంది. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మట్టితో బీటీ రోడ్డు పూడుకు పోయింది



మా తండా మీదుగా జడ్చర్లకు వెళ్లే బీటీ రోడ్డు పెద్ద లారీలు నడవడంతో మట్టితో పూడుకు పోయింది. వాహనాలు వచ్చినపుడు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- రమేష్, కొత్తూర్ పెద్దతండా

అధికారులు పట్టించుకోవడం లేదు



రిజర్వాయర్ నిర్మిస్తున్నారంటే సంతోషంగానే ఉంది. కానీ భారీ లారీలు, చిన్న రోడ్డు మీదుగా నడపడం వల్ల రోడ్లన్ని పాడవుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. పాడైన రోడ్డును బాగుచేయాలి.

- మల్లేష్, కర్వెన

కొనసాగుతున్న వినాయక పూజలు

దేవరకద్ర: మండలంలోని వివిధ గ్రామాల్లో వాడవాడలా కొలువైన గణనాథులు మండపాల దగ్గర భక్తులు పిల్లలు పెద్దలు గత ఐదు రోజులుగా పూజలు కొనసాగిస్తున్నారు. ప్రజలు భక్తి శ్రద్దలతో ప్రత్యేకపూజా కార్యక్రమం నిర్వహించి గణనాథుడికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి మొక్కులను తీర్చుకుంటున్నారు.

చిన్నచింతకుంటలో.. మండలంలోని బండర్‌పల్లి గ్రామంలో బుధవారం వినాయకుడి నిమజ్జన వేడుకలు యువకులు ఘనంగా నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 13 అడుగుల భారీ వినాయక విగ్రహం మండలంలోనే అత్యంత పెద్దదిగా అందరిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ప్రత్యేక భజనలతో గణనాథులను నిమజ్జనానికి తరలించారు.

నేడు భూత్పూర్‌లో గణపతి హోమం

భూత్పూర్: మండల కేంద్రంలో ఉన్న సీతారామలక్ష్మణ సంజీవరాయ దేవస్థాన యువజన సంఘం ఆధ్వర్యంలో ఆరు మండపాలను ఏర్పాటు చేసి గణపతి హోమం నిర్వహిస్తున్నట్లు యువజన కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హోమంలో పాల్గొనేందుకు దంపతులు హాజరు కావల్సి ఉంటుందని, అయితే ఈ హోమంలో పాల్గొనే దంపతులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఉచితంగా పాల్గొనే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామంలోని దంపతులు, మహిళలు ఉపయోగించుకోవాలని వారు సూచించారు. అదే విధంగా గణపతి నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని సెప్టెంబర్ 2 వ తేదీన నిమర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అయితే ప్రతి ఏటా ఇంటింటికి గణపతి ప్రసాద కార్యక్రమంలో భాగంగా మూడవ తేదీ ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. హోమం అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా ఉంటుందని తెలిపారు.



బండర్‌పల్లిలో పూజలో పాల్గొన్న యువజన కమిటీ సభ్యులు



వినాయకుడికి నమస్కరిస్తున్న చిన్నారులు


7న మండల సమావేశం

దేవరకద్ర: వచ్చే నెల 7న మండల సర్వసభ్య సమావేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఈవీ గోపాల్ బుధవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. కార్యక్రమానికి అన్నిగ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొనాలని తెలిపారు.

కొనసాగుతున్న భూసర్వే

దేవరకద్ర: మండలంలోని రైతుల యొక్క భూ సర్వే కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు గ్రామంలోని ఇంటింటికి తిరిగి రైతుల దగ్గర భూ సర్వే కార్యక్రమం నిర్వహించి రైతుల యొక్క పాస్‌పుస్తకం, ఆధార్ కార్డులను నమోదు చేసుకొని తప్పొప్పులను సరి చేస్తున్నారు. గ్రామాల్లోకి రెవెన్యూ అధికారులు వచ్చినప్పుడు రైతులు సహకరించాలని తహసీల్దార్ చిన్నకిష్టన్న తెలిపారు.

సినిమా గైడ్



రాఘవేంద్ర : లై


కూరగాయల ధరలు

రూపాయల్లో..



పచ్చిమిర్చి	30	కాకరకాయ	40
టమాట	40	చౌవులకాయ	30
వంకాయ	40	ఆలుగడ్డ	30
చిక్కుడు	60	ఉల్లిగడ్డ	20
బెండకాయ	40	క్యాప్సికమ్	40
బీరకాయ	40	దొండకాయ	40

దినఫలాలు



అదృష్టసంఖ్యలు : 3, 4



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): పైఅధికారుల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. ఉన్నత పదవులు అందుకుంటారు. వృత్తి, వ్యాపారాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. పెద్దల ఆరోగ్యం కొంత కలవరపెడుతుంది.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): బోధన, రవాణా రంగాల వారికి ప్రోత్సాహకరం. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. సాంకేతిక కోర్సుల్లో చేరేందుకు చేసే ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురవుతాయి. కీలక సమాచారం అందుకుంటారు.



మిథునరాశి: (మే21-జూన్21): రుణప్రయత్నాలు ఫలిస్తాయి. బీమా, గ్రాట్యుటీ, పింఛన్ వ్యవహారాలు ఒక కొలిక్కి వస్తాయి. ఇంటికి అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. కుటుంబ సభ్యుల ఆరోగ్యం కలవరపెడుతుంది.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): జనసంబంధాలు విస్తరిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు, సంభాషణలు ఉల్లాసం కలిగిస్తాయి. భాగస్వామ్యాలు లాభిస్తాయి. విలువైన డాక్యుమెంట్లు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. వైద్యం, పరిశ్రమలు, సేవల రంగాల వారికి ఆర్థికంగా లాభిస్తుంది. ఉద్యోగ ప్రయత్నాలకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశాలున్నాయి.



కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): విద్యార్థులు లక్ష్యాలు సాధిస్తారు. ప్రేమలు ఫలిస్తాయి. సృజనాత్మకంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. చిన్నారుల విషయాల్లో శుభపరిణామాలు సంభవం. చిన్నారుల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): ఎంతో కాలంగా వాయిదా పడుతున్న పనులు పట్టుదలతో పూర్తి చేస్తారు. ఇంట్లో వేడుకలకు ఏర్పాట్లు చేస్తారు. బంధుమిత్రులతో ఉల్లాసంగా గడుపుతారు. కుటుంబ వ్యవహారాల కారణంగా అ శాంతికి గురవుతారు.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): విద్యార్థులకు శుభప్రదం. విలువైన పత్రాలు అందుకుంటారు. కొత్త స్నేహాలు చిగురిస్తాయి. ప్రియతములతో ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. రవాణా, బోధన రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లకు అవకాశం ఉంది. అదనపు ఆదాయం సమకూర్చుకుంటారు. బ్యాంకులు, చిట్‌ఫండ్ల రంగాల వారికి నిరుత్సాహకరంగా ఉంటుంది.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. కొత్త వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయగలుగుతారు. కళలు, సాహిత్యం, బోధన రంగాల వారికి ప్రోత్సాహకరం. సంకల్ప సిద్ధికి అధికంగా శ్రమించాలి.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పైచదువులు, విదేశీ ప్రయాణాలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. రుణాలు మంజూరవుతాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు. గతం గుర్తు చేసుకుంటారు. ఆరోగ్యం మందగించే అవకాశం ఉంది.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): స్పెక్యులేషన్లు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. వేడుకల్లో బంధుమిత్రులను కలుసుకుంటారు. షాపింగ్‌కు అనుకూలం. బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

గడువుకు ముందే

మిషన్ భగీరథ పూర్తి చేయాలి

మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ సి.లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

మహబూబ్‌నగర్ టౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ తాగునీటి పథకాన్ని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్ణీత కాలవ్యవధి కంటే ముందే వచ్చే అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని, జనవరి నుంచి ఇంటింటికి నీరందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ఆదేశించారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్ అధ్యక్షత మిషన్ భగీరథ పథకంపై సమీక్ష నిర్వహించారు. ఎంపీ జితేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌గౌడ్, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, అంజయ్యయాదవ్, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్ జిల్లాల కలెక్టర్లు రజత్ కుమార్ షైనీ, శ్రీధర్ పాల్గొన్నారు. సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ ప్రధాన పైపు లైన్ల పనులు, వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులను ఎట్టి పరిస్థితుల్లో అక్టోబర్ నాటికి పూర్తి చేయాల్సిందేనని అన్నారు. గ్రామాల్లో ఇండ్ల వద్దకు నీటిని తీసుకెళ్లే ఇంట్రావర్క్స్ పనులను కూడా జనవరి లోగా పూర్తి చేయాలని సూచించారు. వచ్చే జనవరి 1న ఇంటింటికీ నల్లాల ద్వారా తాగునీరు అందించే లక్ష్యంతో అందరూ పనిచేయాలని అన్నారు. గుంతలు పూడ్చకుంటే ఏజన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

పనుల నాణ్యతలో ఎక్కడా రాజీ పడొద్దని మంత్రులు చెప్పారు. ఏ చిన్న పొరపాటు జరిగినా పథకం మొత్తం మొత్తం దెబ్బతినే ప్రమాదం ఉందని, అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. నాలుగు జిల్లాల్లో ఇంకా 600 కిలో మీటర్ల పైప్‌లైన్ వేయాల్సి ఉందని అధికారులు చెప్పగా, రోజూ ఎన్నికిలో మీటర్ల మేర వేస్తున్నారని జూపల్లి ప్రశ్నించారు. 13 నుంచి 15 కిలోమీటర్ల లక్ష్యంతో నిర్మాణం సాగుతుందని అధికారులు వివరించారు. రాజాపూర్ మండలంలోని కొన్ని గ్రామాల్లో రోడ్ల మధ్యనే పైపులైన్లు వేస్తున్నారని, దానిపై మళ్లీ రోడ్డువేస్తే భవిష్యత్ లో ఇబ్బందులు తలెత్తవా? అని మంత్రి లక్ష్మారెడ్డి ప్రశ్నించగా, అక్కడ పైపులైన్ వేయాలంటే భవనాలు అడ్డుగా ఉన్నాయని, గ్రామస్థుల నుంచి అంగీకారం రాకపోవడంతో రోడ్డుని తవ్వాల్సి వచ్చిందని అధికారులు చెప్పుకొచ్చారు. రైల్వే లైన్ల క్రాసింగులు, జాతీయ రహదారిపై క్రాసింగుల వివరాలను మంత్రులు అడిగారు. రైల్వే క్రాసింగులకు అన్ని అనుమతులు రాగా, జాతీయ రహదారికి ఇంకా 32 చోట్ల పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అచ్చంపేటకు రామన్‌పాడు నీటి సరఫరాలో తరచూ ఇబ్బందులు కలుగుతున్నాయని, దీన్ని ఎందుకు పరిష్కరించడం లేదని ఎమ్మెల్యే బాలరాజు ప్రశ్నించారు. మోటర్ల ఇబ్బంది, పైప్ లైన్ల లీకేజీల వల్లే అలా జరుగు తోందని అధికారి సమాధానం ఇచ్చారు. మూడేళ్లనుంచి ఇదే సమాధానం చెబుతున్నారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు.


గద్వాల జిల్లాలో పనులు పూర్తవ్వాలి



గద్వాల జిల్లాలో మిషన్ భగీరథ పనులను త్వరగా పూర్తిచేయాలి. తాగునీరులేక నడిగడ్డలో జనం అల్లాడుతున్నారు. పను లు పూర్తి చేయాలి.

-బండారి భాస్కర్, జడ్పీ ఛైర్మన్

రైతుల వివరాలు ఇవ్వండి



సెప్టెంబర్ 1 నుంచి రైతు సమన్వయ సమితులను ఏర్పాటు చేస్తున్నందున రైతులందరి వివరాలను వ్యవసాయాధికారులు ఎమ్మెల్యేలకు అందించాలి. ఎమ్మెల్యేలు రైతు సమితిలకు సభ్యులను ప్రతిపాదించాలి. రైతుల జాబితాలను(జేడీఏ సుచరిత) ఎమ్మెల్యేలకు అందించాలి.

-మంత్రి జూపల్లి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కృష్ణ: మండలంలోని కృష్ణ చెక్‌పోస్టు అంతరాష్ట్ర రహదారిపై బు ధవారం కారు, బైకు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడని ఏఎస్పై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మాగనూర్ మండలం కొత్త పల్లికి చెందిన మంగలి అశోక్ (38) తన మిత్రుడు వెంకటేష్‌తో కలిసి వ్యవసాయ పనినిమిత్తం రాయి చూర్‌కు వెళ్లి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగిందని అన్నారు. ఈ ప్రమాదంలో అశోక్ మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమో దుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నిప్పంటించుకొని మహిళ మృతి

వీపనగండ్ల: మండలంలోని బొల్లారం గ్రామంలో బుధవారం రాజేశ్వరి అనే వివాహిత ఒంటికి నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త అనుమానంతో వేధించడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడిందని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. పోలీసుల కథనం మేరకు... బోయ ఒంకరాజేశ్వరీ, ఈదయ్యలకు 11 సంవత్సరాల క్రితం వివాహ మైంది. వీరికి అరుణ, నందిని, స్వర్ణ, గణేష్ నలుగురు పిల్లలు ఉన్నారు. కూలీ పనులు చేసుకొని జీవనం సా గిస్తున్న దంపతుల మధ్య అనుమానం పెనుభూతమైంది. భార్య మరొకరితో అక్రమ సంబంధం పెట్టు కుందనే అనుమానంతో ఈదయ్య తరచూ గొడవ పడేవాడు. మంగళవారం భార్యకు ఫోన్ రావడంతో బయటికి వెళ్లింది. అనుమానం వచ్చి న భర్త ఫోను తీసుకొని మాట్లాడేది ఎవరంటూ భార్యతో గొడవ పడి పక్కనే ఉన్న తమ్ముడి గుడిసెలో నిద్రపోయాడు. మద్యం మత్తులో ఉన్న రాజేశ్వరీ పిల్లలకు రూ. 20లు ఇచ్చి షాపుకు పంపించి గుడిసెకు గడియ పెట్టుకొంది. అనంతరం ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుని మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధాప్యాన్ని జయిస్తే జీవితం సుఖమయం

ఎస్వీఎస్ మెడికల్ కళాశాల ఎండీ డా. కే.జే రెడ్డి



జ్యోతి ప్రజ్వళన చేస్తున్న కృష్ణారెడ్డి

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం): వృద్ధాప్యం ప్రతి మనిషికి వస్తుం దని, దాన్ని జయిస్తేనే జీవితం అంతా సుఖమయంగా ఉంటుందని ఎస్వీఎస్ మెడికల్ కళాశాల, ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా. కే.జేరెడ్డి అన్నారు. తెలంగాణ ఫిజియాలజిస్టుల సంఘం, ఎస్వీఎస్ మెడికల్ కళాశాల ఫిజియాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాతీయ సెమినార్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో వృద్ధాప్యంలో జరిగే మార్పులపై చాలా మందికి అవ గాహన లేకపోవడం వల్లే అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. వృద్ధాప్యం ప్రారంభం కాగానే మొదటి సమస్య కీళ్ల నొప్పులేనని, వాటిపై కొంత శ్రద్ధ తీసుకుంటే నియంత్రించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆహారం సమతుల్యంగా తీసుకోవడం, ఒత్తిడి లేకుండా ఉండడం వలన ఎలాంటి అనారోగ్య సమస్యలు రావని అన్నారు. తెలంగాణ ఫిజియాలజిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. మహ్మద్ అబ్రార్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో వచ్చే మానసిక, శారీరక మార్పులు, జబ్బులపై అవగాహన పెంచుకోవలసిన అవసరం ఉందన్నారు. జోద్‌పూర్ సంచీన్ హాస్పిటల్ న్యూరోలాజిస్టు డా. ప్రతాప్ సంచీన్, హైదరాబాద్ యూనివర్సిటీకి చెందిన ఫిజియాలజీ విభాగం హెచ్‌వోడీలు డా. కొల్లూరు వీ.ఏ రామ్య, బయోకెమిస్ట్రీ విభాగం హెచ్‌వోడీ డా. కృష్ణవేణి మిశ్ర, ఎనిమల్ మయోలజి హెచ్‌వోడీ డా. అనితా జాగోటి, ఎం.ఎస్ రామయ్య మెడికల్ కళాశాల బెంగుళూరు ఫిజియాలజీ విభాగం హెచ్‌వోడీ డా. వెంకటేష్, గడక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఫిజియాలజీ హెచ్‌వోడీ డా. రవీంద్ర పీ.ఎన్‌లు తమ పరిశోధనలను ప్రజెంటేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ మెడికల్ కళాశాల ఫిజియాలజీ విభాగం ప్రఫెసర్లు డా. నర్సింగరావు, డా. రామేశ్వర్‌రెడ్డి, డా. రామారావు, డా. జోషి, డా. జయవిక్రమ రెడ్డి, డా. కేశవరావు, డా. కుముధిని మోహన్ రావు, ఎస్వీఎస్ రెసిడెంట్ డైరెక్టర్ రాంరెడ్డి, సీఈవో డా. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'కేఎల్ఐ పనుల పురోగతిపై చర్చకు సిద్ధం'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

కల్వకుర్తి అర్బన్: కేఎల్ఐ పనుల పురోగతిపై చర్చించేందుకు తాము సిద్ధమని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి అ న్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని ఆర్అండ్‌డీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేఎల్ఐ పీఆర్ఎ ల్ఐ పనులపై, నీటి కేటాయిం పులపై కల్వకుర్తి ఎమ్మెల్యే వంశీ చేస్తున్న విమ ర్శలపై ఆయన మండిపడ్డారు. గత ప్రభు త్వంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రు లుగా పనిచేసిన సుదర్శన్‌రెడ్డి, పొన్నాల లక్ష్మ య్యల సమక్షంలో చర్చిద్దామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కేఎల్ఐ 160 కిలో మీటర్ల వరకు లక్ష 80వేల ఎకరాలకు సాగు నీరు అందించాలని పనులు ప్రారంభించారని, గుత్తేదారు ఆపనులను అసంపూర్తిగా వదిలివేయడంతో ఈప్రాంతానికి చుక్క నీరు రాకుండా చేసినప్పుడు వంశీచందర్‌రెడ్డి ఎక్కడ ఉన్నాడని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ కేఎల్ఐకి పూర్తి స్థాయిలో సాగునీరు అందిం చేందుకు నీటి కేటాయింపులు 25 టీఎంసీల నుండి 40 టీఎంసీలకు పెంచారని తెలిపారు. డి82ద్వారా చివరి ఆయకట్టు నాగిళ్ల వరకు మరో 37,774 ఎకరాలకు సాగునీరు అందించేందుకు సర్వే పూర్తి అయ్యిందన్నారు. విలేకరుల సమావేశంలో టీఆర్ఎస్ నాయకులు బాలాజీసింగ్, ఆనంద్‌కుమార్, భూపతిరెడ్డి, సూర్యప్ర కాశ్‌రావు, వెల్దండ జడ్పీటీసీ వెంకటమ్మ, ఎంపీపీ రామేశ్వరమ్మ, వైస్ఎంపీపీ పర్వతాలు గౌడ్, నాయకులు సంజీవ్‌యాదవ్,మబ్బుల్, బాలేమియ, గోళి సురేందర్‌రెడ్డి, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌గౌడ్, సర్పంచ్‌లు జిల్లెల రాములు, శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

హరితహారం పనులను పూర్తి చేయాలి

● ఏపీడీ చంద్రశేఖర్

ఊట్కూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న హరితహారం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఏపీడీ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా హరితహారం పనులపై సమీక్షించారు. సమావేశంలో ఏపీఓ జయమ్మ, ఈసీ రంజిత్ కుమార్, ఎంపీడీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈత వనాల పెంపుతో కార్మికులకు ఉపయోగం

● ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత

ఊట్కూర్: గ్రామాల్లో ఈత వనాలు పెంచుకోవడం వలన గీత కార్మికులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఎక్సైజ్ సూపరింటెండెంట్ అనిత అన్నారు. బుధవారం మండలంలోని పాతపల్లిలో హరితహారంలో భాగంగా ఆమె ఈత మొక్కలను నాటి మాట్లాడారు. హరితహారంలో ప్రభుత్వమందిస్తున్న ఈత చెట్లను గీత కార్మికులు తమ పొలాల్లో నాటుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రమణయ్య, ఎస్సై సలీం, ఏపీడీ చంద్రశేఖర్, ఏపీఓ జయమ్మ, సర్పంచ్ శంకరమ్మ, ఉప సర్పంచ్ కృష్ణయ్య, కార్యదర్శి రాజేష్ తదితరులున్నారు.

ఓపెన్‌లో దరఖాస్తులకు ఆహ్వానం

కోస్గి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ఫీజు లేకుండా సెప్టెంబర్ 9వ తేదీ వరకు గడువు ఉందన్నారు. సమీప మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7382929798లో సంప్రదించాలని ఆయన కోరారు.

విశ్రాంత పీఈటీ గోపాలానికి సన్మానం

మక్తల్: జాతీయ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్రాంత పీఈటీ బి.గోపాలంను జాయింట్ కలెక్టర్ శివకుమార్ మంగళవారం ఘనంగా సన్మానించి, జ్ఞాపికను అందించారు. మక్తల్‌కు చెందిన విశ్రాంత పీఈటీ గోపాలం 34 ఏళ్లుగా పీఈటీగా పనిచేస్తూ క్రీడా రంగంలో తన సేవలను అందించి ఎంతోమంది విద్యార్థులను రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దడంలో సఫలీకృతులు అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డిలు గోపాలంను సన్మానించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

మక్తల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బుధవారం తహసీల్దార్ ఓంప్రకాష్ విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈనెల 29న జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా స్థానిక మినీ స్టేడియంలో ఏకలవ్య స్పోర్ట్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందించారు. కార్యక్రమంలో విశ్రాంత పీఈటీ గోపాలం, హెచ్ ఎం అంజిలమ్మ, పీఈటీలు అంబ్రేష్, జగదీశ్, శ్రీలత, రూప, నవీన్, ఆంజనేయులు, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

టీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ సర్పంచ్

మక్తల్: ఊట్కూర్ మండలం వల్లంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ సర్పంచ్ కిష్టప్ప 50 మంది అనుచరులతో బుధవారం ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నివాసంలో ఆయన ఊట్కూర్ జడ్పీటీసీ సూర్యప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ నర్సింహా గౌడ్, ఊట్కూర్ మాజీ ఎంపీపీ వెంకట్రామ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ అరవింద్‌కుమార్, టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో శేఖర్, నారాయణ, రాజు, హన్మంతు, వెంకటేష్, వెంకటయ్య, నర్సిములు, ఆనంద్, అంజప్ప, చిన్న బాలప్ప తదితరులున్నారు.

పీఆర్టీయూ మండల కమిటీ ఎన్నిక

మక్తల్: పీఆర్టీయూ మండల అధ్యక్షునిగా శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికలకు జిల్లా అధ్యక్షుడు రఘురాంరెడ్డి, కార్యదర్శి నారాయణగౌడ్‌లు ఎన్నికల పరిశీలకులుగా హాజరయ్యారు. కమిటీలో యూనియన్ ప్రధాన కార్యదర్శిగా ఎల్లప్ప, గౌరవ అధ్యక్షునిగా వెంకట్రాములు, ఉపాధ్యక్షునిగా కె.శ్రీనివాస్, రాఘవరెడ్డి, మహిళ అధ్యక్షురాలిగా అరుణ, కార్యదర్శిగా సృజన, వెంకటేష్, సభ్యులుగా కృష్ణయ్య, శ్రీనివాస్‌రావు, రాంగోపాల్, తిరుమల్‌రావు, నర్సి ములు, రామన్ గౌడ్, శ్రీనివాసులు, బాబు, జగన్నాథ్‌రెడ్డిలు ఎన్నికయ్యారు.

టీఆర్ఎస్‌ను భూస్థాపితం చేస్తాం

● బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య
● టీఆర్ఎస్ హామీల అమలు కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ముందు మహాధర్నా



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కొండయ్య, పార్టీ నాయకులు

కృష్ణ: రానున్న 2019 ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీని, ప్రభుత్వాన్ని భూస్థాపితం చేస్తామని బీజేపీ మహా సంపర్క్ అభియాన్ చైర్మన్, రాష్ట్ర నాయకుడు కొండయ్య అన్నారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం, అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ బీజేపీ మండల అధ్యక్షుడు ఊసేనప్ప అధ్యక్షతన తహసీల్దార్ కార్యాలయం ముందు నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఎన్నికలకు ముందు వచ్చిన వాగ్దానాలను నేటికి ఆచరణలో చూపడం లేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి లక్షకోట్లు మంజూరుచేస్తే వాటిని దారి మళ్లించి ఇతర అభివృద్ధి పనులకు వాడుకుంటున్నారని ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాలకు టీఆర్ఎస్ ప్రభుత్వం ఈ మూడేళ్ల పరిపాలనలో చేసిందేమీ లేదన్నారు. రానున్న 2019 ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు కృష్ణ సంతబజార్ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ యతీరాజ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు అమర్‌కుమార్‌దీక్షిత్, జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కర్నెస్వామి, విద్యాసాగర్, నాయకులు జయానంద్‌రెడ్డి, నల్లెనర్సప్ప, శ్రీనివాస్, మజ్జిగ సురేష్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఇంటర్వ్యూ

రైతులు అధికారుల సూచనలను పాటించాలి

● ఏఓ గణేష్‌రెడ్డి



మాగనూర్ : రైతులు తాము పండించే పంటలకు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని ఏఓ గణేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

పైరుకు పట్టిన చీడపురుగుల నివారణకు ఒకేసారి రెండు మూడు మందులు కలిపి వాడవచ్చునా.?

చీడ పురుగుల నాశనం కోసం ఒకేరకమైన మందును వాడాలి. రెండు మూడు రకాల మందులు వాడితే పురుగు చనిపోదు.

వరిపంట పిలకలు వేసే సమయంలో నీటిని అధికంగా వాడాలా.?

నీటిని పొలంలో ఉంచరాదు. పొలాల్లో నీరు ఎక్కువగా ఉంటే పిలకలు ఆశించినంతగా రావు.

పంటలకు యూరియా వాడవచ్చా.?

అధిక శాతం వాడితే పంటలు ఏపుగా పెరిగి పురుగులు ఆశించడమే కాకుండా, అధిక వర్షాలకు పంట నేలకొరిగే పరిస్థితి ఏర్పడుతుంది.

వ్యవసాయ శాఖ ద్వారా జిప్సం సరఫరా చేస్తారా.?

సరఫరా చేస్తాం.

తాడిపత్రులు అందుబాటులో ఉన్నాయా.?

ప్రస్తుతం అందుబాటులో లేవు. త్వరలోనే వస్తాయి.

ఇసుక అనుమతులపై లొల్లి

● కడంపల్లి గ్రామ పంచాయతీకి డబ్బులు చెల్లించాలని వాహనాలను నిలిపివేసిన సర్పంచ్ భర్త
● రూ.18వేలు వసూలు చేసి రశీదులు ఇవ్వని పంచాయతీ కార్యదర్శి

కోస్గి రూరల్: కోస్గి మండలం కడంపల్లి గ్రామంలో ఇసుక అనుమతులపై లొల్లి జరిగింది. ఆన్ లైన్ ద్వారా ఇసుక రవాణాకు అనుమతులిస్తామన్న కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం తహసీల్దార్ బాలచందర్‌రావు 16 ట్రాక్టర్లకు అనుమతులనిచ్చారు. కడంపల్లి వాగు నుంచి ఇసుక రవాణాకు గాను ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు ట్రాక్టర్ల రవాణాకు ఆయన అనుమతులిచ్చారు. అయితే కడంపల్లి వాగు నుంచి వాహనాలు తరలుతుండగా ఆ గ్రామ సర్పంచ్ భర్త ట్రాక్టర్లకు వెళ్లకుండా అడ్డుకున్నారు. గ్రామ పంచాయతీకి రూ.1050 చెల్లిస్తేనే అను మతులిస్తానని నడంతో వాహన యజమానులు తహసీల్దార్‌కు ఫోన్ చేశారు. స్పందించిన ఆయన వెంటనే పంచాయతీ కార్యదర్శి బాసిద్‌అలీని కడంపల్లి వాగు వద్దకు పంపించారు. ఆయన కూడా సర్పంచ్ భర్తకు వంత పాడడంతో కొందరు చేసేదిలేక డబ్బులు చెల్లించి వాహనాలను తీసుకు వెళ్లారు. మొత్తం 16 ట్రాక్టర్లతో 68 ట్రిప్పుల రవాణాకు అనుమతులిచ్చారు. అయితే, డబ్బులు చెల్లించిన వాహనాలకు కార్యదర్శి రశీదులు ఇవ్వకపోవడంతో కొందరు ట్రాక్టర్ల యజమానులు రశీదుల కోసం ఆయనతో వాగ్వాదానికి దిగుతూ ఇసుక రవాణాను అసంపూర్తిగా నిలిపివేశారు. కాగా, డబ్బులు చెల్లించిన లబ్ధిదారులకు ఇసుక రవాణా ఆగిపోవడంతో వాటి కోసం అధికారులు ఎప్పుడు అనుమతులిస్తారోనని వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.



కడంపల్లి వాగు వద్ద పంచాయతీ కార్యదర్శి బాసిద్‌అలీతో వాగ్వాదం చేస్తున్న ట్రాక్టర్ యజమానులు

'బీజేపీ ఎదుగుదలను చూసి ఓర్వలేకపోతున్న నాయకులు'

మాగనూర్: మక్తల్ నియోజకవర్గంలో బీజేపీ ఎదుగుదలను చూసి టీఆర్ఎస్ నాయకులు మతిస్థిమితం లేని మాటలు మాట్లాడుతున్నారని బీజేవైఎం మండల అధ్యక్షుడు మారెప్ప, బీజేపీ ప్రధాన కార్యదర్శి అశోక్‌గౌడ్‌లు ఆరోపించారు. బుధవారం బీజేపీ నాయకుడు కృష్ణ నివాసంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచిన ప్రజా ప్రతినిధులు కమీషన్లు దండుకునేందుకు టీఆర్ఎస్ పార్టీలోకి వెళ్లారన్నారు. ఖరీఫ్‌లో నీటిని అందిస్తామని చెబుతున్న ఎమ్మెల్యే నేటికి ఒక్క ఎకరాకు నీళ్లు అందించారా అని ప్రశ్నించారు. అధికార పార్టీ బలం చూసుకొని మాట్లాడే నాయకులను బీజేపీ చూస్తూ ఊరుకోదన్నారు. సమావేశంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, భీంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎడివెళ్లిలో ఇరువర్గాల ఘర్షణ

ఊట్కూర్: మండలంలోని ఎడివెళ్లిలో వినాయకచవితి సందర్భంగా వినాయకులు ముందుపోవాలనే చిన్నపాటి వాదన ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. గ్రామంలోని దళిత వినాయకులు వరుస క్రమంలో వెళ్లాలనే అంశంపై వాదోపవాదాలు చేసుకున్నారు. నిమజ్జనం అనంతరం ఓ వర్గంవారు మరోవర్గం ఇళ్ల వద్దకెళ్లి దాడిచేసి ఇరువర్గాలు ఘర్షణ చేసుకున్నారు. దీంతో ఎస్సై విజయ్ ఘటనా స్థలానికి చేరుకొని పికెట్ ఏర్పాటుచేశారు. ఘర్షణలో గాయపడ్డ సాయన్న అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పదిమందిపై ఎస్సై కేసు నమోదు చేశారు.

భూములను పరిశీలించిన సాంఘిక సంక్షేమ శాఖ డీడీ

ఊట్కూర్: రైతులకు భూపంపిణీ కోసం చేసే భూసేకరణలో భాగంగా బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విజయ్‌కుమార్ మండలంలోని పెద్దపొర్ల, కొల్లూర్ గ్రామాల్లో భూములను పరిశీలించారు. పెద్దపొర్లలో భాస్కర్‌రెడ్డి 102 సర్వే నంబర్‌లో 18ఎకరాల 29 గుంటల భూమిని, కొల్లూర్‌లో రైతులకు చెందిన భూములను ఆయన పరిశీలించారు. డీడీ వెంట తహసీల్దార్ తిరుపతయ్య, సర్వేయర్ కృష్ణయ్య, వీఆర్ఏ తిరుపతి, రైతులు ఉన్నారు.

'దళితులు జాగృతం కావాలి'

కోస్గి: సమాజంలో దళితులపై కొనసాగుతున్న దాడుల పట్ల దళితులు జాగృతం కావాలని ఎస్సీఆర్‌పీ రాష్ట్ర కన్వీనర్ దేవేంద్రప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు పోకలలక్ష్మణ్ పిలుపునిచ్చారు. బుధవారం ఎస్ఎస్‌సీఆర్‌పీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా వారు జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమాజంలో దళితులను టార్గెట్ చేస్తూ మత మార్పిడిలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. కొందరు క్రిస్టియన్ మతంపై ఆసక్తి కనబరుస్తూ మతం మార్చుకోవడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, కాశన్న, ఆనంద్, మల్లేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న ఎస్సీఆర్‌పీ నాయకులు

నీటి సమస్యను పరిష్కరిస్తా : ఎంపీ

నారాయణపేట టౌన్ : మారుతి కాలనీలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరిస్తానని ఎంపీ జితేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. పట్టణంలోని భీమండి కాలనీలో గల హనుమాన్ దేవాలయం వద్ద యువజన సంఘం వారు ప్రతిష్ఠించిన వినాయకుడికి మంగళవారం రాత్రి ఎంపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆ కాలనీవాసులతో పాటు కౌన్సిలర్ తదితరులు మారుతి కాలనీలో నెలకొన్న నీటి సమస్యను ఎంపీకి వివరించారు. బోరు మంజూరు చేస్తూ మిషన్ భగీరథ పథకం ద్వారా శాశ్వత తాగునీటిని అందించేందుకు ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించనున్నట్లు జితేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. కాలనీవాసులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపి శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పీఈటీలు

మండల స్థాయి క్రీడాపోటీలు ప్రారంభం

ధన్వాడ : మండలంలోని గోటూర్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సారథ్యంలో ఒక్క రోజు నిర్వహించే మండల స్థాయి ఆటల పోటీలను ఉన్నత పాఠశాల హెచ్ ఎం పురుషోత్తం బుధవారం ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ప్రత్యేక కోటా కింద ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అండర్-17, 14 విభాగాల్లో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బాల్‌రాజ్, పీడీ గజానంద్, పీఈటీలు ఊసు రవి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, రహీం, నాగమణి, జ్యోతి, నరహరి పాల్గొన్నారు.

'ఆపరేషన్లు ప్రారంభించాలి'

ధన్వాడ : స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభించి కు.ని. శస్త్రచికిత్సలు చేయాలని యువజన కాంగ్రెస్, టీఆర్ఎస్ నాయకులు నరేందర్‌గౌడ్, చంద్రయ్యలు బుధవారం ధన్వాడకు వచ్చిన సబ్ కలెక్టర్ కృష్ణాదిత్యకు వినతిపత్రం సమర్పించారు.

'మరుగుదొడ్లను వేగంగా నిర్మించాలి'

ధన్వాడ : బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా ఎంపిక చేసిన మండలంలోని నాల్గు ఊర్లలో గాంధీ జయంతి వరకు వంద శాతం మరుగుదొడ్లు, ఇంకుడుగుంతల నిర్మాణాలను పూర్తి చేయాలని ఈఓపీఆర్డీ కాళప్ప సూచించారు. స్థానిక మండల పరిషత్ లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపిక చేసిన గ్రామాల్లో కార్యదర్శులు, సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వందశాతం ఇంకుడు గుంతలు, మరుగుదొడ్లను నిర్మించేలా చూడాలన్నారు.

'ఒక్క టీకాతో రెండు వ్యాధులను తరిమికొడదాం'



మరికల్‌లో చిన్నారికి టీకా వేస్తున్న డా.హరినాథ్

మరికల్ : తట్టు, రూబెల్లా వ్యాధులను తరిమివేసేందుకు ఒక్క ఎంఆర్ టీకాను వేయించుకోవాలని డా.హరినాథ్ కోరారు. బుధవారం స్థానిక అంగన్ వాడీ కేంద్రాల్లో నిర్వహించిన ఎంఆర్ టీకా పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తొమ్మిది నెలల నుంచి 15 ఏళ్లలోపు పిల్లలకు ఎంఆర్ టీకాను వేయించాలన్నారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్త భారతి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు ఉన్నారు.

కోయిలకొండ : మండల కేంద్రంలోని అన్నిఅంగన్ వాడీ సెంటర్ల పిల్లలకు వైద్య సిబ్బంది బుదవారం ఎంఆర్ టీకాలు వేశారు. ఆయాలు ప్రతి ఇంట్లోని పిల్లలను తీసుకొచ్చి టీకాలు వేయించారు.

కలెక్టర్ ఆదేశాలతో డబ్బాల తొలగింపు

మరికల్ : స్థానిక గ్రామ పంచాయతీ ముందు బాలుర పాఠశాల ప్రహరీకి ఆనుకొని ఏర్పాటు చేసిన డబ్బాలను తొలగించాలని మంగళవారం కలెక్టర్ రొనాల్డ్‌రోస్ తహసీల్దార్‌ను ఆదేశించగా, బుధవారం ఆర్ఐ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది వాటిని తొలగించారు.

క్రికెట్ పోటీల్లో మాడ్రన్ స్కూల్ విజేత

నారాయణపేట : స్థానిక క్రీడా మైదానంలో బుధవారం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో మాడ్రన్ స్కూల్ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, వైదిక పాఠశాల స్కూల్ ద్వితీయ స్థానంలో నిలిచింది. ఆయా జట్లకు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రఘు రామయ్యగౌడ్, రమేష్, పీఈటీలు రమణ, అక్తర్ పాషా, యాసీన్ , అంజనేయులు తదితరులున్నారు.

డివిజన్ స్థాయికి ఎంపికైన విద్యార్థులు

దామరగిద్ద : మండలంలోని కాన్ కుర్తి గ్రామంలో అండర్-14, 17 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలను నిర్వహించగా, 30 మంది విద్యార్థులు డివిజన్ స్థాయికి ఎంపికయ్యారని జీహెచ్ ఎం ప్రభాకర్, పీఈటీ రామకృష్ణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఘనంగా వినాయక నిమజ్జనోత్సవాలు

నారాయణపేట రూరల్ : మండలంలోని అంత్వార్, చిన్నజట్రం, బోయిన్‌పల్లితండా తదితర గ్రామాల్లో బుధవారం వినాయక నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా వినాయక మండపాల నిర్వాహకులు ముందురోజు రాత్రి నుంచి ప్రత్యేక అలంకరణలతో ప్రతిమలను వాహనాలపై ఊరేగించారు. గ్రామ పురవీధుల గుండా నృత్యాలు, కోలాటాలు, అడుగుల భజనలతో నిమజ్జనానికి తరలించారు. అంతకుముందు ఆయా మండపాల నిర్వాహకులు అన్నదానాలు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో కోస్గి హన్మంత్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, విశ్వనాథ్, బాలవర్ధన్, మాణిక్యప్ప, ఎం.వెంకటయ్య, కె.బాల్‌రాజ్, వెంకటగిరి, నర్సిములు, కొండప్ప, సందుల బాల్‌రాజ్‌గౌడ్, వెంకటేశ్, టి.నారాయణ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

దామరగిద్ద : మండలంలోని కాన్ కుర్తి, ఉల్లిగుండం, బొమ్మన్ పాడ్‌లలో వినాయక విగ్రహాలను ఆయా గ్రామ చెరువుల్లో నిమజ్జనం చేశారు. అంతకుముందు పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కోయిలకొండ : మండల కేంద్రంలో పలు మండపాల నిర్వాహకులు వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. స్థానిక శివాజీనగర్‌లో గల ఆది హనుమంతు ఆలయంలో అన్నదానం చేపట్టారు. తెలుగుగేరి వినాయకుడి లడ్డూను ఆ కాలనీకి చెందిన శివ రూ.51 వేలకు వేలంలో దక్కించుకున్నాడు.

ధన్వాడ : మండలంలోని ఎంనోన్ పల్లి, కిష్టాపూర్, రాంకిష్టాయిపల్లి, బుడ్డమర్రితండా, నిడుగుర్తితండాల్లో వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఎంనోన్ పల్లిలో టీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించేలా వినాయకుడిని అలంకరించారు. ఆయా కార్యక్రమాల్లో గౌని శ్రీనివాసులు, ఎన్ .మల్లప్ప, వీరప్ప, పాండునాయక్, కుర్వ రాజు, ఖాజాపాషా, ఎర్ర మల్లప్ప, వెంకటేష్ నాయక్, సంతోష్ పాల్గొన్నారు.

రెండు లడ్లు.. రూ.80 వేలు

నిడుగుర్తితండాలో వినాయకుడి వద్ద ఏర్పాటు చేసిన రెండు లడ్లను వేలం వేయగా ఆడియో శంకర్, తుల్జా నాయక్ చెరోటి రూ.40వేల చొప్పున దక్కించుకున్నారు.

రాంకిష్టాయిపల్లిలో మల్లికార్జున్ యువజన సంఘం ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను వేలంలో కుర్వ మోనెమోని నర్సిములు రూ.38 వేలకు దక్కించుకున్నాడు.

గోటూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మట్టి ప్రతిమను ఏర్పాటు చేసి చుట్టూ గడ్డిని పెంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

విశ్రాంత ఉద్యోగుల పూజలు

నారాయణపేట టౌన్ : స్థానిక పళ్ల పరిమళాపురంలో ధనుంజయ అన్నప్ప దీక్షిత్ స్వగృహంలో వెలిసిన 800 ఏళ్ల క్రితం నాటి నిమజ్జనం ఎరుగని వినాయకుడికి విశ్రాంత ఉద్యోగులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగ సంఘం నాయకులు వెంకట్రాములు, ముకుందప్ప, అంబాజీరావు, నారాయణరావు, లక్ష్మయ్య, విద్యాధర్ దీక్షిత్ , గాయకుడు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోయిలకొండలో లడ్డూ దక్కించుకున్న వ్యక్తితో నిర్వాహకులు



నిడుగుర్తి తండాలో నృత్యం చేస్తున్న యువకులు



చిన్నజట్రంలో చేనేత మగ్గం నేస్తున్నట్లు అలంకరణ

సమస్యలపై సబ్ కలెక్టర్‌కు వినతి



సబ్ కలెక్టర్ కృష్ణాదిత్యకు వినతిపత్రం అందిస్తున్న సుభాష్‌రోడ్డు వాసులు

నారాయణపేట టౌన్ : పట్టణంలోని పలు సమస్యలపై బుధవారం సబ్ కలెక్టర్ కృష్ణాదిత్యకు సుభాష్ రోడ్‌కు చెందిన చంద్రశేఖర్, మన్నె రామకృష్ణ, లక్ష్మీకాంత్ , కొణంగేరి హన్మంతు, మోట్కాల్ వెంకట్‌రెడ్డి, మోహన్ , నర్సిములుగౌడ్, నోకల్ శ్రీనివాస్‌రెడ్డి, మొగుల్ మడ్క నారాయణలు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో రహదారులపై ఆవులు విచ్చల విడిగా తిరుగుతుండడం వల్ల వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రోడ్డుపై ఉన్న ప్లాస్టిక్ వస్తువులు భుజించడం వల్ల పశువులు పలు రోగాల బారిన పడుతున్నాయన్నారు. లెక్కలేనని పందులు, కుక్కలు వార్డుల్లో తిరుగుతుండడం కూడా ప్రజలకు తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. అలాగే పేరపళ్ల, దామరగిద్దకు వెళ్లే రహదారుల పక్కనున్న ఇటుక బట్టీలు నుంచి వచ్చే పొగతో వాహనదారులు తంటాలు పడుతున్నారన్నారు. బట్టీలను పట్టణానికి మూడు కి.మీ. దూరం తరలించాలని, రోడ్లపై ఉండే ఆవుల విషయంలో యజమానులు స్పందించకుంటే వాటిని గోశాలకు తరలించాలని కోరారు.

'పెన్షన్ విద్రోహ దినంగా ప్రకటించాలి'



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి

నారాయణపేట టౌన్ : సీపీఎస్‌ను రాష్ట్రంలో అమలు చేసిన సెప్టెంబర్ 1ని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ ఆరోజు నల్ల బ్యాడ్జీలు ధరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కాంట్రిబ్యూషన్ పెన్షన్ పథకాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాటం చరిత్రలో నిలిచిపోయేలా విజయవంతం చేయాలన్నారు. ఇది ఆదిపత్య ఉబలాటం కాదు.. ఉనికి కోసం ఆరాటం కాదు.. 1.20లక్షల మంది బతుకు పోరాటమన్నారు. ఎవరి జెండా ఏదైనా ఎజెండా మాత్రం సీపీఎస్సే అన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ నిబంధనలపై జీఓలను సత్వరమే విడుదల చేసి బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో కిష్టయ్య, రఘుపాల్, వెంకట్రాంరెడ్డి, నాగరాజు, బాలాజీ, సాయన్న, కిష్టన్న ఉన్నారు.

సినిమా గైడ్

నారాయణపేట

మనోహర్	అర్జున్ రెడ్డి
మహేశ్వరి	ఆనందో బ్రహ్మ
బాబా 70 ఎంఎం	జయ జానకి నాయక
బాబా 35 ఎంఎం	ఫిదా

కూరగాయల ధరలు రూపాయల్లో..

టమాట	50	బెండకాయ	40
క్యాప్సికమ్	40	ఆలుగడ్డ	20
పచ్చిమిర్చి	40	చిక్కుడు	60
పాలకూర	40	బీర్నీస్	60
క్యాబేజీ	40	క్యారెట్	60
వంకాయ	50	చౌళకాయ	40

'పేట'లో పసిడి ధరలు..

పది గ్రాముల బంగారం	రూ.30,600
కిలో వెండి	రూ.41,300

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా





నాగర్‌కర్నూలులో సాగుతున్న నిమజ్జన ర్యాలీ



వనపర్తిలో గణేష్ నిమజ్జన పూజ..



దండాలయ్యా.. ఉండ్రాలయ్యా అంటూ భక్తులు లంబోదరుడిని నిమజ్జనానికి తరలించారు. మంగళవారం నాగర్‌కర్నూలు, అచ్చంపేట, మహబూబ్‌నగర్ పట్టణాల్లో వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ర్యాలీ నిర్వహించి బొజ్జ గణపయ్యలను నిమజ్జనానికి తీసుకొచ్చారు. ర్యాలీ భజా భజంత్రీలు, డ్యాన్స్‌ల నడుమ సాగింది. సర్వాంగ సుందరంగా అలంకరించిన వాహనాల్లో ఏకదంతుడు కొలువై ఉండగా భక్తులు తన్మయంతో ఆడి పాడారు. జై గణేష్ మహారాజ్‌కీ జై అన్న నినాదాలతో ఆయా ప్రాంతాలు మార్మోగాయి.



నాగర్‌కర్నూలులో భక్తులకు అన్నదానం



జడ్చర్లలో రూ.1.08లక్షలకు లడ్డూను దక్కించుకున్న భక్తుడు



నాగర్‌కర్నూలులో నిమజ్జనంలో నృత్యాలు చేస్తున్న మహిళలు



మహబూబ్‌నగర్‌లో కారుపై నిమజ్జనానికి తరలుతున్న బొజ్జగణప్య





అచ్చంపేటలో నిమజ్జనంలో నృత్యాలు చేస్తున్న మహిళలు

అచ్చంపేటలో..



మహబూబ్‌నగర్‌లో స్వాగత వేదికపై మంత్రులు



మహబూబ్‌నగర్‌లో లంబోదరుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న చిన్నారులు



సామూహిక సెలవు కోరుతూ అధికారులకు వినతి

కొల్లాపూర్: సీపీఎస్‌కు నిరసనగా సెప్టంబర్ ఒకటిని సామూహిక సెలవు దినంగా పాటించాలని టీఎస్‌సీపీఎస్‌ఈఏ ఆధ్వర్యంలో బుధ వారం ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ఉద్యోగు లకు పాత విధానం వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బృంగి కృష్ణాప్రసాద్, వరప్రసాద్, రభ్బాని, లక్ష్మయ్య పాల్గొన్నారు.



వెంకటేశ్వర: జయ జానకి నాయక
సత్యసాయి : అర్జున్‌రెడ్డి

'విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి'



మాట్లాడుతున్న జమే మస్జిద్ కమిటీ అధ్యక్షుడు మేహెది నవాజ్

కొల్లాపూర్: కొల్లాపూర్ పట్టణంలోని పురాతన శివాలయంలోని నవ గ్రహ విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి శిక్షించాలని కొల్లాపూర్ జమే మస్జిద్ కమిటీ అధ్యక్షుడు మేహెది నవాజ్, ప్రధాన కార్యదర్శి ఎస్ ర హీం పాష, ఉపాధ్యక్షుడు సయ్యద్‌హసనోద్దిన్ , మార్కెట్ కమిటీ వైస్ చైర్మ న్ ఎండీ ఎక్బాల్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కొల్లాపూర్ ప్రాంతం మత సామరస్యానికి నిలయమని అన్నారు. సమావేశంలో మైనార్టీ నాయకులు ఎండీ ఖాజ చాఉష్, ఎండీ నజీర్ బాబ, సయ్యద్ అమీన్ , సైపోద్దిన్ , ఎండీ కరీం, షాలు, శోఫీ ఘోరి, రఫిక్, ఖాజామైనోద్దిన్ , వికార్, ఖలీమ్, రహీం, మజహర్, మతిన్ , చోట మియ్య, నయూమ్, ఎండి రుఖు పాల్గొన్నారు.

'బీసీలపై వివక్షత చూపుతున్న సీఎం కేసీఆర్'



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకుడు కురుమూర్తి

పెద్దకొత్తపల్లి: సీఎం కేసీఆర్ బీసీలపై వివక్షత చూపుతున్నారని బీసీ సంక్షేమ సంఘం కొల్లాపూర్ తాలూకా నాయకుడు కురుమూర్తి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని కులాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నా బీసీ సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. ఈ కార్యక్రమం లో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు అంజనేయులు, నాయకులు భారత్ కుమార్ గౌడ్, డబ్బా ఎల్లయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్ పంపిణీ



కేసీఆర్ కిట్‌ను అందిస్తున్న డాక్టర్ మౌనిక

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లికి చెందిన గడ్డిగోపుల రేణుకకు కేసీఆర్ కిట్‌ను బుధవారం డాక్టర్ మౌనిక అందజేశారు. ఈ సం దర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో గర్భిణులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు చేయించుకుంటే కేసీఆర్ కిట్‌లను అందజేయడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై అతుకుల గుంతలు

పెంట్లవెల్లి: మండల కేంద్రం లోని మంచాలకట్ట, మాధవ స్వామి నగర్‌కు వెళ్లే రహదారిపై గుంతలు ఏర్పడటంతో వాహనాల రాకపోకల కు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతు న్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గత సంవత్సరం పుష్కరాల సమయంలో రోడ్డు నాసి రకంగా వేయడంతో గుంతలు ఏర్ప డ్డాయని ఈ గుంతలల్లో మట్టి వేయడంతో వర్షపు నీరు నిండు తోందని తెలిపారు. ఈ రాహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రా మ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. వెంటనే ఆర్‌అం డ్‌బీ అధికా రులు చొరవ చూపి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని వారు కోరుతు న్నారు. పుష్కారాల సమయంలో హడావుడిగా రోడ్డు వేసారని గ్రామ ప్రజలు ఆరోపిస్తు న్నారు. అత్యవసర సమయాల్లో మండల కేంద్రానికి వెళ్లాలంటే చా లా ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ ప్రజల అవస్థలను దృష్టిలో ఉంచుకొని వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



బురద మయంగా ఉన్న రోడ్డు

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



మండల కేంద్రం నుండి మంచాలకట్ట, మాధవ స్వామి నగర్‌కు వెళ్లే దారిలో రోడ్డు దెబ్బ తినడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కల్గుతున్నాయి. రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉండ టంతో గుంతలు కనబడక ప్రమా దాలు జరుగుతున్నాయి.

\- రాఘవేంద్ర,

అధికారులు పట్టించుకోవాలి



గత సంవత్సరం పుష్కారాల సమ యంలో గుత్తేదా రులు నాసిరకంగా రోడ్లు వేయడంతో గుంతలు ఏర్పాడ్డా యి. రాత్రి సమ యంలో గుంతలు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు రోడ్డు నిర్మాణ పను లు చేపట్టాలి.

-కురుమయ్య
సీపీయం మండల కార్యదర్శి

అదనంగా బస్సు నడపాలి

కోడేరు: వనపర్తి నుండి కోడేరుకు అదనంగా బస్సును నడపాలని బుధవారం మండల పరిధిలోని తుర్కదిన్నె గ్రామంలో విదార్థులు ధర్నాను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి నిత్యం మాచుపల్లి, సింగాయిపల్లి, తుర్క దిన్నె, ముత్తిరెడ్డి పల్లి, నాగులపల్లి గ్రామా లను నుండి విద్యార్థులు దాదాపు 100 మందికి పైగా కోడేరుకు చదువుకునేందుకు వెళ్తుంటామని ఆర్టీసీ అధికారులు ఒకే బస్సు నడపడంతో పాఠశా లలకు ఆలస్యం అవుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్థులు ఉన్నారు.

విశ్వబ్రాహ్మణ గ్రామ కమిటీ ఎన్నిక

పెద్దకొత్తపల్లి: మండల పరిధిలోని దేవలతిర్మాలపూర్ గ్రామంలో విశ్వ బ్రాహ్మ ణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నట్లు ఆ కమిటీ అధ్యక్షుడు వెం కటశేషయ్య బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్య క్షుడిగా నారా యణ చారి, కార్యదర్శిగా జె.రా మకృష్ణ, సహాయకార్యదర్శిగా సత్యం, కోశా ధికారిగా బాలకృష్ణయ్యలతో పాటు భాస్కర చారి, ఆచారి, సుధాకర్, వీరబ్రహ్మం, శేఖర్, యాదగిరి, వెంకటనారాయణ, అరవింద్, కాశీం, ప్రభాకర్‌లను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

పెంట్లవెల్లిలో

మండల కేంద్రంలో బుధవారం విశ్వ బ్రాహ్మణుల మండల కమిటీని ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సు ద ర్శన్ చారి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాసచారి, కా ర్యదర్శిగా బి. సత్యనారాయణ, సహా కార్య దర్శిగా ఎన్ . శివశంకర్, కోశాధికారిగా వెంక టేశ్వర్ల చారి, కార్యవర్గ సభ్యులుగా ఎస్ భా స్కర్ చారి, చంద్రశేఖర్ చారి, నగేష్, రవి కుమార్, భాస్కరచారిని ఎన్నుకున్నారు.

ఘనంగా గంప జాతర



పూజలు చేస్తున్న గొల్ల కురుమలు

కుడికిళ్ల(కొల్లాపూర్ రూరల్): మండల పరిధిలోని కుడికిళ్ల గ్రామంలో బుధవారం గంపజాతరను గొల్ల కురుమలు ఘనంగా జరుపుకున్నారు. వారు అమ్మవారికి ప్రత్యేక పూజాలు చేశారు. ప్రతి సంవత్సరం మోగ్గ కార్తీలో అమ్మవారికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు. ఈ పూజా కార్యక్రమాలల్లో గొల్ల కురుమ సంఘాల నాయకులు, తదితరులున్నారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే లక్ష్యాన్ని సాధిస్తారు

కోడేరు: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితేనే లక్ష్యాన్ని సాధిస్తారని తెలంగాణ నవ నిర్మాణ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మురళీధర్ గుప్త అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిం చారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థుల్లో పట్టుదల, ఆత్మవిశ్వాసం ఉంటే ఏదైన సాధించవచ్చని అన్నారు. ఈ కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ లక్ష్మన్ నారాయణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

కొల్లాపూర్ రూరల్

విద్యార్థులే దేశ భవిష్యత్తుకు మూల స్థంబాలని తెలంగాణ నవ నిర్మాణ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మురళీధర్ గుప్త అన్నారు. బుధవారం కొల్లాపూర్ పట్టణంలోని డిగ్రీ కళాశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులతోనే దేశ నిర్మాణం ఆధారపడ్డి ఉంటుందన్నారు. బాగ చదివి మంచి స్థాయిలో ఉండి సామాజ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. నవ సామాజం వైపు అడుగులు వేయలంటే విద్యార్థులతోనే సాధ్యం అన్నారు.

కోడేరు మండల సమాచారం

తహసీల్దార్	: 9000101490
వ్యవసాయాధికారి:	7288894355
ఎంపీడీఓ :	8008901073
ట్రాన్స్‌కో ఏఈ :	9440813495
సీఐ :	9440795725
ఎస్ఐ :	9440900914

గ్యాస్ సమాచారం

భారత్ గ్యాస్: 08501- 275384

మార్కెట్ ధరలు

వేరుశెనగ	: 5000
కందులు	: 5050
వరి(1010రకం)	: 1450
మొక్కజొన్న	: 1410

ఇంటర్వ్యూ

గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- సర్పంచ్ భాగ్యమ్మ



కోడేరు: జనుంపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రా మంగా తీర్చిదిద్దు తాన ని ఆ గ్రామ సర్పంచ్ భాగ్య మ్మ అన్నారు. బుధ వారం ఆమె ఆంధ్ర జ్యో తికి ఇచ్చిన ఇంట ర్వ్యూ లో ఈ విషయాలు పేర్కొ న్నారు.

గ్రామంలో తాగు నీటి సమస్య ఎలా ఉంది..?

గ్రామంలో ప్రస్తుతం తాగు నీటి సమస్య ఉంది. సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. గతంలో బోరులను లీజ్‌కు తీసుకోవడంతో సమస్య లేకుండా వుండేది. త్వరలోనే గ్రామంలో మంచి నీటి సమస్య లేకుండా చేసేందుకు కృషి చేస్తాం.

గ్రామంలో మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేశారా..?

గ్రామంలో 90 శాతం వరకు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాం. మరుగుదొడ్లు నిర్మిం చుకున్న ప్రతి ఒక్కరికి బిల్లులు చెల్లించాం. నిర్మాణంలో ఉన్న వాటిని కూడా పూర్తి చే యించేందుకు కృషి చేస్తున్నాం.

ఇంటి పన్నులు వసూలు చేశారా..?

గ్రామంలో 2016-17 సంవత్సరానికి 100 శాతం ఇంటి పన్నులు వసూలు చేశాం. వసూలు చేసిన వాటిని గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేసి గ్రామ అభివృద్ధి పను లకు ఖర్చు చేస్తున్నాం.

డ్రైనేజీ, పనులు చేపట్టారా..?

14వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా డ్రైనేజీ నిర్మాణ పనులు చేపడుతున్నాం.

వీధి దీపాలు ఏర్పాటు చేశారా...?

గ్రామంలో అన్ని కాలనీలో వీధి దీపాలను ఏర్పాటు చేశాం. ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకుంటున్నాం.

చిన్నారులు జాగ్రత్త

- వర్షాకాలంలో పొంచి ఉన్న వ్యాధులు
- విరేచనాల బారిన పడే ప్రమాదం
- పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



నాగర్‌కర్నూల్ వైద్యవిభాగం: ప్రస్తుతం వర్షకాలం కావడంతో రోగాలు ఎక్కువగా వ్యాపిస్తాయి. చిన్నారులకు వెంటనే సోకే ప్రమాదముంది. పట్టణ కేంద్రాల్లో అవసరాలకు సరిపడ మురుగు కాల్వల నిర్మాణాలు లేకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో చాలా చోట్ల డ్రైనేజీ వ్యవస్థ నిర్మించకపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది. దాంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఫలితంగా చిన్నారులు డెంగీ, మలేరియా బారిన పడుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నాలుగు ప్రైవేట్ చిన్నపిల్లల ఆస్పత్రులు ఉండగా రోజూ 80 నుంచి 120 అవుట్ పేషెంట్లు వస్తున్నారు. వారిలో రోజుకు రెండు నుంచి మూడు వరకు కేసులు మలేరియా, డెంగీ ఉంటున్నాయి.

విరేచనాలు ప్రమాదం: ఈ కాలంలో మూడేళ్లలోపు పిల్లలకు తరచూ నీళ్ల విరేచనాలు అవుతుంటాయి. ఆరునెలలు దాటిన పిల్లలు కింద ఆడుకునాక చేతులను నోట్లో పెట్టుకోవడం, ఆట వస్తువులను ముట్టుకుని మళ్లీ నోట్లో పెట్టుకోవడం వల్ల నీళ్ల విరేచనాలు అవుతుంటాయి. రోటా వైరస్ సూక్ష్మక్రిమి ద్వారా నీళ్ల విరేచనాలు అవుతుంటాయి.



చిన్నారులను జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చిన మహిళలు

చికిత్స-నివారణ మార్గాలు: వైద్యులు సూచించిన మందులతోపాటు ఓఆర్ఎస్ ద్రావకాన్ని పట్టించాలి. సులభంగా జీర్ణం అయ్యే ఆహారం అందించాలి. కొబ్బరి నీళ్లల్లో చిటికెడు ఉప్పు కలిపి తాగిస్తుండాలి. పిల్లలకు రెండేళ్లు వచ్చేవరకు కాచి చల్లార్చిన నీటినే ఇవ్వాలి. వర్షాకాలంలో ఇది తప్పనిసరి. పిల్లలకు వాడే వస్తువులను వేడి నీటితో శుభ్రపరచాలి. తల్లిపాలు పిల్లలకు మరింత బలాన్ని ఇస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

కనిపించని డ్రై డే: ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకాలం వచ్చిందంటే చిన్న పిల్లలు మొదలుకొని వృద్ధులు, పెద్దవారు సైతం విషజ్వరాల బారిన పడుతున్నారు. గ్రామాల్లోని మురుగు కాల్వల్లో దోమలు చేరకుండా ముందస్తుగా యాంటీ లార్వా ఆపరేషన్ లు నిర్వహించాలి. ప్రతి శుక్రవారం వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ, ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా, ఇండ్లు శుభ్రంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. కానీ ఈ కార్యక్రమాలు అమలు కావడం లేదు.

జాగ్రత్తలు తీసుకుంటున్నాం



డెంగీ, మలేరియ, స్వైన్ ఫ్లూ వంటి కేసులు ఆస్పత్రిలో నమోదు కాలేదు. జిల్లా ఆస్పత్రి ఆవరణ ప్రాంతాల్లో దోమలు చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నాం. ఇంట్లో నిద్రించేటప్పుడు దోమతెరలను వినియోగించడం శ్రేయస్కరం.

- డాక్టర్ రాకేష్‌చంద్ర, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, జిల్లా ఆస్పత్రి

ఓఆర్ఎస్ తాగించాలి



ఈ కాలంలో చిన్న పిల్లలకు విరేచనాలు అవుతుంటాయి. చీము, రక్తంతో కూడిన విరేచనాలు అయితే యాంటీ బయాటిక్స్ వాడాలి. ఓఆర్ఎస్ ద్రావకాన్ని తాగిస్తుండాలి.

- డాక్టర్ చక్రధర్‌రెడ్డి, చిన్న పిల్లల వైద్య నిపుణులు

సీపీఎస్ రద్దు కోసం.. ఉద్యమం



జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి: 2004 సెప్టెంబర్ 1 నుంచి అమలవుతున్న కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానంతో ఉద్యోగ భద్రత కరువైందని ఉద్యోగ, ఉపాధ్యాయులు వాపోతున్నారు. 2003లో అప్పటి దేశ ఆర్థిక పరిస్థితుల నేపథ్యం, ప్రపంచబ్యాంకు సంస్కరణలు అమలు చేసే క్రమంలో నాటి ఎన్ డీఏ ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పని చేస్తున్న అన్ని స్థాయిల అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు అప్పటి వరకు ఉన్న పింఛన్ విధానాన్ని రద్దు చేసింది. దాని స్థానంలో కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ విధానం ప్రకారం ఉద్యోగి రిటైరయిన తర్వాత ఇచ్చేందుకు ప్రతినెలా అతని మూలవేతనం, డీఏ నుంచి పదిశాతం చందాగా చెల్లించేదాన్ని, ఆ మొత్తానికి సమానమైన మొత్తాన్ని ప్రభుత్వం చెల్లిస్తూ ఆనిధిని కేంద్ర కార్మిక శాఖ ద్వారా షేర్ మార్కెట్‌లో వెచ్చిస్తున్నారు. ఉద్యోగి రిటైరయిన సమయంలో ఉండే షేర్ మార్కెట్ లాభ నష్టాలకనుగుణంగా ఆ ప్రయోజనాలను సంబంధిత ఉద్యోగికి అందిస్తారు. అయితే ఖచ్చితమైన ప్రయోజనం లేకుండా, ఉద్యోగి, వారి కుటుంబ భవిష్యత్ ని షేర్‌మార్కెట్ దయా దాక్షిణ్యాలపై వదిలేయడమేంటనే ప్రశ్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నుంచి వెలువడుతోంది. అప్పటి దేశ పరిస్థితులకంటే ఇప్పటి పరిస్థితులు బాగయిన నేపథ్యంలో పాత విధానాన్ని తిరిగి ప్రవేశపెట్టాలని, దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పాత, కొత్త విధానాలకు ఉన్న తేడా

పాత పింఛన్ విధానం ప్రకారం ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ తర్వాత జీవిత కాలం పాటు పింఛన్ ఇవ్వడంతో పాటు, వారు మరణించిన తర్వాత భాగస్వామికి ఆమొత్తంలో సగం చొప్పున ఇచ్చేవారు. కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానం వచ్చాక ఈ పింఛన్ రద్దయ్యింది. దీని స్థానంలో ఉద్యోగి ఉద్యోగ జీవిత కాలంలో మూలవేతనం, డీఏ నుంచి పదిశాతం భవిష్యత్ లో అసరాల కోసం చందాగా చెల్లిస్తూ వస్తే రిటైర్ అయిన తర్వాత ఆమొత్తానికి ప్రభుత్వం కొంత జమచేసి ఉద్యోగి ఉద్యోగ విరమణ సందర్భంగా అందజేస్తారు. ఉద్యోగ విరమణ సమయంలో, లేకపోతే ముందస్తుగా విరమణ చేసినా, లేదా పదవీకాలంలో ఉండి మరణిస్తే ఈ ప్రయోజనం వర్తిస్తుంది. ఈ విధానంతో ఉద్యోగికి, ఆయన కుటుంబానికి భద్రత లేకుండాపోయిందనే ఆందోళన ఆయా వర్గాల్లో వ్యక్తమౌతోంది. అంతేకాకుండా పాత పింఛన్ విధానంలో జీపీఎఫ్ ఖాతాలో మెచ్యూరిటీ మొత్తానికి ఆదాయపు పన్ను మినహాయింపు ఉంటే, ఈ విధానంలో పన్ను మినహాయింపుని రద్దు చేశారు. పాత విధానంలో ఉద్యోగ విరమణ గ్రాట్యుటీ, డెత్ గ్రాట్యుటీ, సర్వీస్ గ్రాట్యుటీ ఉంటే, ఈ విధానంలో కేవలం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే వర్తిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ, స్థానిక సంస్థల ఉద్యోగులకు వర్తించడం లేదు. పాత విధానంలో రిటైర్ అయిన ఉద్యోగికి మిగిలిన సెలవు దినాలను జీతంగా మార్చుకునే అవకాశం ఉంటే, ఇక్కడ ఆ విధానం లేదు. కాంపెన్సేషన్ పింఛన్, ఇన్ వాలిడ్ పింఛను, సూపర్ యాన్యుయేషన్, ఉద్యోగ విరమణ పింఛన్ అవకాశం పాత విధానంలో ఉండగా, సీపీఎస్‌లో వీటన్నింటికీ అవకాశం లేకుండా 40 శాతం యాన్యుటీ కొన్నాక, దానిపై వచ్చే మార్కెట్ ఆధారిత ఆదాయం మాత్రమే ఉంటుంది. గత విధానంలో రిటైర్‌మెంట్ తర్వాత డీఏ పెరిగితే పింఛన్ లో కలిపేవారు. ఈ విధానంలో దాన్ని రద్దు చేశారు. పాత విధానంలో ప్రావిడెంట్ ఫండ్ సదుపాయం, పింఛన్ కు ప్రభుత్వ గ్యారంటీ ఉంటే, కొత్త విధానంలో పీఎఫ్‌కు అవకాశం లేకుండాపోగా, పింఛన్ కు ప్రభుత్వ గ్యారంటీ ఇవ్వడం లేదు. పాత విధానంలో పింఛన్ కోసం ఉద్యోగి ఒక్క రూపాయి కూడా జమచేయాల్సిన అవసరం లేకపోగా, ఈ విధానంలో మూల వేతనం, డీఏ నుంచి పదిశాతం తప్పనిసరిగా జమచేయాల్సి ఉంది. పాతవిధానంలో ఉద్యోగి జీవితకాలం ఆగరోగ్య భద్రత సదుపాయం కల్పిస్తే సీపీఎస్‌లో 70 సంవత్సరాల వయసు వరకు మాత్రమే ఆ సదుపాయాన్ని అందిస్తున్నారు.

అమలులో లోపాలు

కాంట్రిబ్యూటరీ పింఛన్ విధానం అమల్లో లోపాలు క్రమేపీ వెలుగులోకి వస్తున్నాయి. ఈ పథకం కింద ఉద్యోగుల ద్వారా జమచేసిన మొత్తానికి ఎక్కడా సరైన లెక్కలు లేకుండా పోయాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రధానంగా రిటైరయిన తర్వాత ఉద్యోగులకు దక్కాల్సిన మొత్తంలో 60 శాతం కూడా రావడం లేదనే అంటున్నారు. ఈ పథకం కింద నమోదయ్యేవారికి ఇవ్వాల్సిన శాశ్వత గుర్తింపు సంఖ్య(ప్రాన్) సకాలంలో ఇవ్వకపోవడంతో దాని ప్రభావం పింఛన్ ప్రయోజనాలపై ఉంటుందని ఉద్యోగ, ఉపాధ్యాయులు వాపోతున్నారు. పాతవిధానంలో డెత్ కమ్ రిటైర్‌మెంట్ గ్రాట్యుటీ సదుపాయం, కుటుంబ పింఛన్ సదుపాయం ఉంటే ఈవిధానంలో లేకుండాపోయాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. పాత విధానంలో మినిమం పింఛన్ సదుపాయం ఉంటే, ఈవిధానంలో అది లేదని చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గతేడాది ఆగస్టు 26న డెత్ కమ్ రిటైర్‌మెంట్ గ్రాట్యుటీ విధానాన్ని ప్రకటిస్తే, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆ రాష్ట్రంలో ఫ్యామిలీ పింఛన్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, మన రాష్ట్రంలో ఇప్పటి వరకు వీటి గురించి ప్రభుత్వం ఆలోచించలేదని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. మొత్తమ్మీద సీపీఎస్ విధానం సరికాదని, పాత పింఛన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు భద్రత కల్పించాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమౌతోంది. ఇందుకుగాను సెప్టెంబర్ 1న సామూహిక సెలవు ప్రకటించడంతో పాటు, అదే రోజు జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో ధర్మదీక్ష చేపట్టనున్నట్లు సీపీఎస్ యూనియన్ నాయకులు ప్రకటించారు.

పాత పింఛన్ విధానమే ముద్దు

- సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేయాలి
- రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల డిమాండ్
- జిల్లా కేంద్రంలో ర్యాలీ

పాలమూరు: సీపీఎస్(కాంట్రిబ్యూటరీ పింఛన్ పథకం)ను రద్దు చేసి, పాత పింఛన్ విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఉద్యోగులు, గజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పింఛనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో బుధవారం ర్యాలీలు నిర్వహించారు. అన్ని మండలాలు, డివిజన్ జిల్లా కేంద్రంలో ఈ ర్యాలీలు కొనసాగాయి. జిల్లా కేంద్రంలోని టీఎన్ జీఓస్ భవనం నుంచి పాత బస్టాండ్, క్లాక్‌టవర్, బస్టాండ్ మీదుగా తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు నిర్వహించిన ర్యాలీలో ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు కె.రామక్రిష్ణారావు, కె.శంకర్, కె.శ్రీనివాసరెడ్డి, చెన్న కిష్టన్న, ఎం.సాయిలుగౌడ్, బక్కని నరసింహులు, హీరాం, జ్ఞానేశ్వర్‌రెడ్డి, ఆర్.చంద్రానాయక్, రాజ్‌గోపాల్ మాట్లాడారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనాలు లేకపోగా కనీసం గ్రాట్యూటీ కూడా ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఉద్యోగుల పింఛన్ దేశ స్టాక్‌మార్కెట్‌పై ఆధారపడి ఉండడం శోచనీయమన్నారు. అనంతరం జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధి బృందం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించింది. కార్యక్రమంలో యాదయ్య, రాజేశ్ , వెంకట్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, జి.రవికాంత్ , పి.చంద్రశేఖర్, ఎన్ .గిరిమోహన్ రెడ్డి, ఎస్.విజయ్‌కుమార్, బుచ్చయ్య, సి.హెచ్ వెంకట్‌రెడ్డి, జుర్రు నారాయణ, వి.రాజేశ్ , రవిశంకర్, పి.అనంద్, కె.పి.హనుమంతు, బి.చంద్రకళ, ఎన్ .శివలీల, జె,నిర్మల, జి.సువర్ణ, పి.ప్రమీల, కె.సంధ్య, ఎం.విష్ణుప్రియ, వెంకటేశ్వరమ్మ, క్రిష్ణయ్య, శ్రీధర్‌గౌడ్, నారాయణరెడ్డి, ఎస్.నారాయణ, బి.బసంతప్ప, బి.నవీన్ , సందీప్‌కుమార్‌రెడ్డి, సి.క్రిష్ణయ్యగౌడ, జె.శంకర్, ఎస్.క్రిష్ణయ్య, జి.వెంకటేష్, ఎం.డి రియాజ్, మహబూబ్‌పాష, అంజనేయులు, జి.శ్రీనివాసులు, సి.వెంకట్రాములు, కె.కొండయ్య, సయ్యద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మీకు తెలుసా?

వేడి నీటికన్నా చల్లటి నీరు బరువుగా ఉంటుంది.



ఔనా!

మనుషుల్లో లాగానే..పిల్లులు, శునకాల్లోనూ ఎడమ చేతివాటం, కుడి చేతివాటం ఉంటాయి.

సూక్తి

అస్తమించిన సూర్యుడు తిరిగి ఉదయించినట్లే. పోరాడి ఓడినవాడు తిరిగి గెలుస్తాడు.

ప్రపంచం నిదురోయింది ఇలా..

తుంపరలు తుంపరలుగా వర్షం పడుతున్న వేళ.. మెత్తని పరుపుపై... నులివెచ్చని దుప్పటి కప్పుకుని పడుకుంటే... ఆ సుఖమే వేరు కదూ! చరిత్రలోకి తొంగి చూస్తే.. మంచాలు ఉండవు, పరుపులు కానరావు. 'గచ్చు' కూడా కనిపించదు. కటిక నేలపైనే కంటి నిండా నిద్రపోయేవారు. ఆనాటి ఆదిమ మానవుడి నుంచి.. ఈనాటి ఆధునిక మానవుడి వరకు ఎలా నిద్రించారో ఓ సారి చూద్దామా!

ప్రారంభం

క్రీ.పూ. 10000



ఈ కాలంలో ఎక్కువ శాతం గుహల్లో నివసించేవాళ్లు. నేలపైన జంతువుల చర్మం వేసుకుని నిద్రించేవారు

క్రీ.పూ. 3600



ఈజిప్షియన్లు కర్రతో చేసిన మంచాలపై పడుకునేవారు.

క్రీ.పూ. 3400



పర్షియన్లు 'వాటర్ బెడ్స్'ను ఉపయోగించేవారు. వీటిని గొర్రె చర్మంతో తయారు చేసేవారు.

క్రీ.పూ. 27



ఈ కాలంలో ఉన్ని లేదా పక్షుల ఈకలతో రూపొందించిన విలాసవంతమైన బెడ్స్ వచ్చాయి. రోమన్లు వీటిపైనే నిద్రించేవారు.

క్రీ.శ. 1300

మొదటిసారిగా 'మాట్రస్' అనే పదం ఈ కాలంలోనే వాడారు. 'మాత్రహ్' అనే అరబిక్ పదం నుంచి 'మాట్రస్' వచ్చింది.

1500
(పునరుజ్జీవన కాలం)



యూరోపియన్లు గడ్డితో తయారుచేసిన 'ఫ్యాబ్రిక్ పరుపు'లపై కునుకు తీసేవారు.

18వ శతాబ్దం



ఇదే కాలంలో కాటన్ పరుపులు వచ్చాయి. ప్రజలు వాటిని ఉపయోగించడం అలవాటు చేసుకున్నారు. అమెరికాలో కాటన్ ఉత్పత్తి పెరిగింది ఈ సమయంలోనే.

1865



'కాయిల్ స్ప్రింగ్ మాట్రస్' ప్రజలకు అందుబాటులోకి వచ్చింది ఈ కాలంలోనే. 'సామ్యూల్ పీ కిటిల్' ఈ మాట్రస్‌పై పేటెంట్ హక్కులు పొందాడు.

1879

థామస్ అల్వా ఎడిసన్ ప్రపంచానికి 'బల్బు'ను పరిచయం చేసిన సంవత్సరం. ఈ ఆవిష్కరణతో అమెరికా సగటు పౌరుని నిద్ర దాదాపు మూడు గంటలు తగ్గింది.

1950



విలాసవంతమైన పరుపులు వచ్చిన కాలం. కన్జ్యూమర్ మార్కెట్‌లోకి ఇవి విరివిగా రావడంతో అందరినీ ఆకట్టుకున్నాయి

1960



మోడ్రన్ వాటర్ బెడ్స్ వాడటం మొదలైంది.

1970

స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం తొలిసారిగా 'స్లీప్ రీసెర్చ్ సెంటర్'ను ప్రారంభించింది.

1990



నాసా 'విస్కో ఎలాస్టిక్ ఫోమ్' పరుపుల స్ఫూర్తితో, 'మెమొరీ ఫోమ్ మాట్రస్'లు రూపొందాయి.

ప్రస్తుతం

2012



ఎక్కువ లేయర్లతో సాఫ్ట్ కుషన్‌తో, ఎంతో సౌకర్యంగా ఉండే విలాసవంతమైన పరుపులు అందుబాటులోకి వచ్చాయి.

పదాలు కనుక్కోండి

L	E	A	F	Y	E	Y	P	N
Y	O	A	Y	E	K	L	E	C
C	R	U	E	K	A	D	N	R
E	A	T	L	R	R	L	W	I
I	N	U	L	U	T	O	O	S
P	G	M	O	T	F	C	R	P
C	E	N	W	R	E	D	B	W
E	L	P	P	A	P	M	A	J
B	C	H	A	N	G	E	Q	K


YELLOW PIE BROWN RAKE ORANGE	COLD CRISP AUTUMN RED	LEAF CHANGE APPLE TURKEY

చెప్పగలరా?

ఉడతలో ఉన్నా కానీ మిడతలో లేను
వాద్యంలో ఉన్నా కానీ వాదంలో లేను
మంచిలో ఉన్నా కానీ కంచిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?

జవాబులు

చెప్పగలరా?: ఉద్యమం
జంతర్‌మంతర్: 1. ఉమ్మడి 2. శ్రీకారం 3. సారూప్యం 4. మెరుపు



టంగ్ ట్విస్టర్స్



1. Excited executioner exercising his excising powers exces-sively.
2. Pail of ale aiding ailing Al's travails.
3. Double bubble gum, bubbles double.
4. Salty broccoli, salty broccoli, salty broccoli

జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. మ్మఉడి ▸ ....
2. శ్రీరంకా ▸ ....
3. రూసాప్యం ▸ ....
4. రుపుమె ▸ ....

'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత ఎవరు?



ఎస్.మహిపాల్‌రెడ్డి
సీనియర్ ఫ్యాకల్టీ

1. **'ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017'కి ఆతిథ్యం ఇచ్చిన నగరం?**
ఎ) మాడ్రిడ్(స్పెయిన్)
బి) కౌలాలంపూర్(మలేషియా)
సి) గ్లాస్గో(బ్రిటన్) డి) రోమ్(ఇటలీ)

2. **చైనా ఆటగాడు లిన్‌డాన్‌ను ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 పురుషుల సింగిల్స్ విజేతగా నిలిచింది?**
ఎ) చెన్ లాంగ్(చైనా) బి) లీ చోంగ్ వి(మలేషియా)
సి) కిదాంబి శ్రీకాంత్ (ఇండియా)
డి) విక్టర్ అక్సెల్‌సన్ (డెన్మార్క్)

3. **పి.వి.సింధుని ఓడించి ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2017 మహిళల సింగిల్స్ విజేతగా నిలిచింది?**
ఎ) సైనా నెహ్వాల్(ఇండియా)
బి) నోజోమి ఒకుహర(జపాన్)
సి) ఇంతియానన్ రచనోక్(థాయ్‌లాండ్)
డి) కరోలినా మారిన్ (స్పెయిన్)

4. **ప్రపంచ బాక్సింగ్ చరిత్రలోనే 50 మ్యాచ్‌లను అజేయంగా గెలిచిన ఏకైక ఆటగాడు?**
ఎ) ఫ్లాయిడ్ మెవెదర్(అమెరికా)
బి) ఏకియోవ్(ఫిలిప్పీన్స్)
సి) కానర్ మెక్‌గ్రెగర్(ఐర్లాండ్)
డి) రాకీ మార్సియానో(అమెరికా)

5. **ఇటీవల అమెరికాలోని టెక్సాస్, హూస్టన్ నగరాల్లో వరదలకి కారణమైన హరికేన్?**
ఎ) హార్వీ బి) చార్లీ సి) కోర్సస్ డి) కార్లా

6. **భారత సుప్రీంకోర్టు 45వ ప్రధాన న్యాయమూర్తిగా ఎవరు ప్రమాణస్వీకారం చేశారు?**
ఎ) జస్టిస్ అబ్దుల్ నజీర్ బి) జస్టిస్ దీపక్ మిశ్రా
సి) జస్టిస్ ఉదయ్ లలిత్ డి) జస్టిస్ నారిమన్

7. **ఈశాన్య రాష్ట్రాల చరిత్రలోనే తొలిసారి 100 శాతం కంప్యూటర్ అక్షరాస్యత సాధించిన 'నంగ్‌తాంగ్ తంపక్' గ్రామం ఏ రాష్ట్రంలోనిది?**
ఎ) మేఘాలయ బి) అరుణాచల్‌ప్రదేశ్
సి) అసోం డి) మణిపూర్

8. **తొలి ఎకో పార్కును జమ్మూకశ్మీర్ ప్రభుత్వం ఏ జిల్లాలో ఏర్పాటు చేయాలని నిర్ణయించింది?**
ఎ) కుప్వారా బి) కథువా సి) కార్గిల్ డి) రాజేరి

9. **అండర్-17 దక్షిణాసియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (SAFF) చాంపియన్‌షిప్-2017 విజేత?**
ఎ) ఇండియా బి) నేపాల్
సి) ఆఫ్ఘనిస్థాన్ డి) బంగ్లాదేశ్

10. **రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఇటీవల రచించిన పుస్తకం?**



ఎ) మై మెమొరీస్
బి) ఐ డూ వాట్ ఐ డూ
సి) హాఫ్ లయన్ డి) ఎమర్జింగ్ ఇండియా

11. **జాతీయ క్రీడా దినోత్సవం?**
ఎ) ఆగస్టు 28 బి) ఆగస్టు 29
సి) సెప్టెంబరు 1 డి) ఆగస్టు 30

12. **ఇటీవల మరణించిన టోని డెబ్రమ్‌కి సంబంధించి సరైనది?**
ఎ) మార్షల్ ఐలాండ్స్‌కి చెందిన వ్యక్తి
బి) 2015లో రైట్ లైవ్లీ హుడ్ అవార్డు గ్రహీత
సి) పారిస్ పర్యావరణ ఒప్పందానికి మూలపురుషుడు
డి) పైవన్నీ

13. **101 ఏళ్ల వయసులో ఇటీవల మరణించిన రామనంద సేన్ గుప్తా ఎవరు?**
ఎ) సాహితీవేత్త బి) సినిమాటోగ్రాఫర్
సి) మాజీ హాకీ క్రీడాకారుడు డి) టీవీ వ్యాఖ్యాత

14. **ఇటీవల భారత్‌లో పర్యటించిన నేపాల్ ప్రధాని?**
ఎ) ఖడ్గప్రసాద్ శర్మ ఓలి బి) పుష్పకుమార్ దహల్
సి) షేర్ బహదూర్ దేవ్‌బా డి) రాంభరణ్ యాదవ్

15. **ఫోర్బ్స్ పత్రిక-2017కి గాను ప్రకటించిన ఆసియాలో అత్యంత ధనవంతుల జాబితాలో తొలిస్థానం పొందింది?**
ఎ) ముకేశ్ అంబానీ బి) జాక్ మా
సి) తదాషి యనాయ్
డి) అల్ వలీద్ బిన్ తూల్

16. **దేశ చరిత్రలోనే తొలిసారి నేషనల్ స్పోర్ట్స్ మ్యూజియాన్ని ఇటీవల ఏ నగరంలో స్థాపించారు?**
ఎ) ముంబై బి) న్యూఢిల్లీ
సి) బెంగళూరు డి) చెన్నై

17. **ఇన్ఫోసిస్ నూతన చైర్మన్?**
ఎ) విశాల్ సిక్కా బి) సంజయ్ భంగర్
సి) నందన్ నీలేకని డి) ఇంద్రానూయి

18. **'గోప్యత పరిమితులతో కూడిన ప్రాథమిక హక్కు'గా తొమ్మిది మంది న్యాయమూర్తులున్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. ఈ ధర్మాసనంలో లేనివారు?**
ఎ) జగదీష్‌సింగ్ ఖేహర్, ఎస్.ఎ.బాబ్డే, ఆర్.కె.అగర్వాల్
బి) నారిమన్ , ఎ.ఎం.సప్రే, డి.వై.చంద్రచూడ్
సి) మదన్ .బి.లోకూర్, ఎన్ .వి.రమణ, రణ్‌బీర్‌సింగ్
డి) ఎస్.కె.కౌల్, అబ్దుల్ నజీర్, చలమేశ్వర్

జి.కె. అండ్ కరెంట్ అఫైర్స్

19. **ఇటీవల ఏ ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌకను విధుల నుంచి తొలగించారు?**
ఎ) ఐసిజిఎస్ వరుణ బి) ఐసిజిఎస్ రాజధాని
సి) ఐసిజిఎస్ సామ్రాట్ డి) ఐసిజిఎస్ జిజాబాయి

20. **దేశంలో అంతర్గత రవాణా కోసం భారతీయ ఎయిర్‌లైనర్ 'విస్తారా'తో అవగాహన ఒప్పందం కుదుర్చుకొన్న అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్?**
ఎ) ఖతార్ ఎయిర్‌లైన్స్(ఖతార్)
బి) కొరెండన్ డచ్ ఎయిర్‌లైన్స్(నెదర్లాండ్)
సి) బ్లూబర్డ్ ఎయిర్‌వేస్(గ్రీస్)
డి) ఎయిర్ కోర్సికా(ఫ్రాన్స్)

21. **రైల్వే బోర్డు నూతన చైర్మన్?**
ఎ) సుధా మిశ్రా బి) అతులేష్ జిందాల్
సి) స్థుతి నారాయణ్ కాకరే డి) అశ్వని లోహని

22. **ఒడిశా ప్రభుత్వం అందించే 'బిజూపట్నాయక్ అవార్డు ఫర్ సైంటిఫిక్ ఎక్సలెన్స్'ని 2016కి గాను పొందింది?**
ఎ) ప్రొఫెసర్ సి.ఎన్ .ఆర్.రావు
బి) ప్రొఫెసర్ దిగంబర్ బెహెరా
సి) ప్రొఫెసర్ మన్నెల్లి లక్ష్మీకాంతం
డి) డాక్టర్ ఎ.మోహన్ రావు

23. **తమిళనాడు నూతన ఉపముఖ్యమంత్రి?**
ఎ) టి.వి.దినకరన్ బి) ఒ.పన్నీర్ సెల్వం
సి) జయరామన్ డి) ముత్తుస్వామి

24. **కేంద్రీయ విద్యాలయ సంఘటన్ విద్యార్థుల కోసం ఉద్దేశించిన 'స్వస్థ్ బచ్చే స్వస్థ్ భారత్'ని కేంద్రమంత్రి ప్రకాశ్ జవదేకర్ ఎక్కడ ప్రారంభించాడు?**
ఎ) కొచ్చి(కేరళ) బి) కాన్పూర్(ఉత్తరప్రదేశ్)
సి) పట్నా(బీహార్) డి) మజోలి(అసోం)

25. **ధర్మేంద్ర కుమార్ ఏ సంస్థకు డైరెక్టర్ జనరల్‌గా ఎంపికయ్యారు?**
ఎ) బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బిఎస్ఎఫ్)
బి) రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పిఎఫ్)
సి)సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్ఎఫ్)
డి) ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటిబిపి)

26. **ఇటీవల సైన్యంలో చేరిన LR-SAM క్షిపణి ప్రత్యేకతలు?**
ఎ) భారత్ - ఇజ్రాయెల్ సంయుక్త క్షిపణి
బి) ఉపరితలం నుంచి గగనతలం ప్రయోగిస్తారు
సి) 2017 ఆగస్టులో నేవీలో ప్రవేశపెట్టారు
డి) పైవన్నీ

27. **ఎలక్ట్రానిక్ వ్యర్థాలను(e-waste) పాఠశాలల నుంచి తొలగించడానికి ప్రత్యేక కార్యాచరణను ప్రకటించిన రాష్ట్రం?**
ఎ) కర్ణాటక బి) కేరళ సి) మధ్యప్రదేశ్ డి) గుజరాత్

28. **జన్యు పరివర్తన పంటలపై ఇటీవల సూచనలు చేసిన పార్లమెంటరీ కమిటీకి నేతృత్వం వహించింది?**
ఎ) రేణుకా చౌదరి బి) శంతను కుమార్
సి) ముకుల్ ముద్గల్
డి) టి.వి.ఎస్.ఎన్ ప్రసాద్

29. **లింగ సమానత్వం కోసం 'జండర్' ప్రస్తావన లేకుండా పాస్‌పోర్టులు జారీ చేయాలని నిర్ణయించిన దేశం?**
ఎ) మెక్సికో బి) నెదర్లాండ్స్
సి) పోర్చుగల్ డి) కెనడా

30. **భారత విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మాస్వరాజ్ తొలి 'విదేశీభవన్'ను ఏ నగరంలో ప్రారంభించారు?**
ఎ) ముంబై బి) అహ్మదాబాద్
సి) చెన్నై డి) బెంగళూరు

31. **ఆర్మీ నియామకాల్లో స్వలింగ సంపర్కులకు నిషేధం విధిస్తూ ఆగస్టు 25న ఉత్తర్వులు జారీ చేసిన దేశం?**
ఎ) ఐర్లాండ్ బి) నైజీరియా సి) ఫ్రాన్స్ డి) అమెరికా

32. **స్వలింగ సంపర్కుల కోసం తొలిసారిగా గురుగ్రాం (హర్యానా)లో నిర్వహించిన 'మిస్ ట్రాన్స్‌క్వీన్-2017' విజేత?**



ఎ) నటాషా బి) తొలాయ్
సి) రవీణ డి) లటిసియ

33. **ఐక్యరాజ్య సమితి ప్రపంచ పర్యాటక సంస్థ 2016 గణాంకాల ప్రకారం అతి తక్కువ పర్యాటకులు సందర్శించిన దేశం?**
ఎ) ఫిజి బి) నేరు సి) ఆఫ్ఘనిస్థాన్ డి) తువాలు

34. **2017 ఆగస్టు 31న నిర్వహించనున్న హిందూ మహాసముద్ర దేశాల సమావేశానికి ఆతిథ్యం ఇస్తున్న నగరం?**
ఎ) సింగపూర్ సిటీ బి) కొలంబో
సి) బ్యాంకాక్ డి) న్యూఢిల్లీ

35. **నేపాల్ - భారత్ మధ్య ఏ నదిపై వంతెన నిర్మాణానికి భారత్ ఆమోదం తెలిపింది?**
ఎ) మోచి నది బి) తముర్ నది
సి) అరుణ్ నది డి) కనకయ్ నది

36. **షాంఘై కేంద్రంగా బ్రిక్స్ దేశాలు ఏర్పాటు చేసిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ తన తొలి ప్రాంతీయ కార్యాలయాన్ని ఎక్కడ ఏర్పాటు చేసింది?**
ఎ) ఫోర్టలెజా(బ్రెజిల్) బి) సోచి(రష్యా)
సి) హంగ్జౌ(చైనా)
డి) జొహన్నెస్‌బర్గ్(దక్షిణాఫ్రికా)

37. **2017 ఆగస్టు 26న కేంద్రం ఏ దేశం నుంచి బంగారం, వెండి దిగుమతులను పూర్తిగా నిషేధించింది?**
ఎ) జపాన్ బి) దక్షిణాఫ్రికా
సి) దక్షిణ కొరియా డి) కజకిస్థాన్

38. **బెల్జియం గ్రాండ్‌ప్రి-2017 ఫార్ములావన్ విజేత?**
ఎ) సెబాస్టియన్ వెటెల్ బి) లూయిస్ హామిల్టన్
సి) డేనియల్ రికార్డో డి) నికో రోజ్‌బర్గ్

39. **'జాట్'లను ఒబిసి జాబితాలో చేర్చి ఇటీవల ప్రత్యేక రిజర్వేషన్ కల్పించిన రాష్ట్రం?**
ఎ) మహారాష్ట్ర బి) మధ్యప్రదేశ్
సి) గుజరాత్ డి) రాజస్థాన్

40. **2017 అక్టోబరులో భారత్-అమెరికా సంయుక్తంగా నిర్వహించనున్న సైనిక విన్యాసాలు?**
ఎ) సూర్యకిరణ్ బి) యుద్ధ అభ్యాస్
సి) ఏకువీరన్ డి) వజ్ర

సమాధానాలు

		13) బి	20) ఎ	27) బి	34) బి
1) సి	7) డి	14) సి	21) డి	28) ఎ	35) ఎ
2) డి	8) డి	15) బి	22) బి	29) డి	36) డి
3) బి	9) ఎ	16) బి	23) బి	30) ఎ	37) సి
4) ఎ	10) బి	17) సి	24) ఎ	31) డి	38) బి
5) ఎ	11) బి	18) సి	25) బి	32) ఎ	39) డి
6) బి	12) డి	19) ఎ	26) డి	33) డి	40) బి

JOBS ఉద్యోగాలు

ఎఎస్ఆర్‌బి

అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఎఎస్ఆర్‌బి)- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ సహకారంతో **స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 3, లోయర్ డివిజన్ క్లర్క్** పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 173
పోస్టుల వారీ ఖాళీలు: స్టెనోగ్రాఫర్ 95, క్లర్క్ 78
అర్హత: ఇంటర్ ఉత్తీర్ణత + స్టెనోగ్రఫీ పరిజ్ఞానం + టైపింగ్ నాలెడ్జ్ ఉండాలి.
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్టెనో అభ్యర్థులకు ప్రొఫెషనల్ ఎఫిషియెన్సీ టెస్ట్ కింద నిమిషానికి 80 పదాల వేగంతో 10 నిమిషాల డిక్టేషన్ టెస్ట్ ఉంటుంది. అభ్యర్థులు ఇంగ్లీష్ మేటర్‌ను 50 నిమిషాల్లో, హిందీ మేటర్‌ను 65 నిమిషాల్లో కంప్యూటర్‌మీద ట్రాన్స్‌క్రైబ్ చేయాలి. క్లర్క్ పోస్టుకు కంప్యూటర్ మీద నిముషానికి 35 ఇంగ్లీష్ పదాలు/ 30 హిందీ పదాల టైపింగ్ వేగం ఉండాలి.
అడ్మిషన్ సర్టిఫికెట్ డౌన్‌లోడింగ్: అక్టోబరు 14
సిబిటి నిర్వహించే తేదీ: అక్టోబరు 29
దరఖాస్తు ఫీజు: రూ.200(ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఎక్స్ సర్వీస్‌మన్ / మహిళలకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది)
ఆన్‌లైన్ దరఖాస్తుకు ఆఖరు తేదీ: సెప్టెంబరు 25
వెబ్‌సైట్: www.asrb.org.in, www.icar.org.in

ఐఐఐటి

చిత్తూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటి)- కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

ఆఫీసర్ - ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత + 10 నుంచి 12 ఏళ్ల అనుభవం ఉండాలి. ఎక్స్ సర్వీస్‌మన్ కు ప్రాధాన్యం ఉంటుంది.

గర్ల్స్ & బోయ్స్ హాస్టల్ - కేర్ టేకర్స్ & సూపర్‌వైజర్స్
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణత + తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో ప్రావీణ్యం + కనీసం రెండు నుంచి మూడేళ్ల అనుభవం ఉండాలి

ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ ఫర్ గర్ల్స్
అర్హత: ఫిజికల్ ఎడ్యుకేషన్ సర్టిఫికెట్ + బాలికలకు స్పోర్ట్స్ & ఫిజికల్ యాక్టివిటీస్ నిర్వహించడంలో కనీసం 5 నుంచి 7 ఏళ్ల అనుభవం ఉండాలి.

ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి
ఇమెయిల్: recruitment@iiits.in
వెబ్‌సైట్: www.iiits.ac.in

ఎన్‌టిపిసి

ఎన్‌టిపిసి లిమిటెడ్ ఆధ్వర్యంలోని రామగుండం సూపర్ థర్మల్ పవర్ స్టేషన్ - **మెడికల్ కన్సల్టెంట్స్** పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీలు: 5
పోస్టులు: జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ 2, స్పెషలిస్ట్స్ (సర్జరీ 1, ఇఎన్ టి 1, ఆరోపెడిక్స్ 1)
కాంట్రాక్ట్ వ్యవధి: ఆరు నెలలు
అర్హత - వేతనం: సంబంధిత విభాగంలో ఎండి/ ఎంఎస్ పూర్తిచేసినవారికి నెలకు రూ.75,000; ఎంబిబిఎస్ + సంబంధిత విభాగంలో పీజీ డిప్లొమా పూర్తి చేసినవారికి నెలకు రూ.63,000; ఎంబిబిఎస్ (జిడిఎంఒ) ఉత్తీర్ణులైనవారికి నెలకు రూ.53,000 చెల్లిస్తారు.
ఇంటర్వ్యూ: సెప్టెంబరు 13న
వేదిక: Dhanwantari Hospital, NTPC Ltd, Jyothinagar(PO), Railway Station: Ramagundam, Bus Station: Godavarikhani, Dt. Peddapalli
ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తును ఇమెయిల్‌కు పంపుకోవాలి.
ఇ-మెయిల్: adhocrstps@ntpc.co.in

నీలి మందును ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?


వేముల అశోక్
సీనియర్ ఫ్యాకల్టీ

ద్రవ పదార్థాలు

1. ద్రవ ప్రియ కొల్లాయిడ్‌కు ఉదాహరణ?
ఎ) పాలు బి) బంక సి) పొగమంచు డి) రక్తం

2. జెల్ తయారీలో ఉపయోగించే సూత్రం?
ఎ) సస్పెన్షన్ బి) సినారసిస్
సి) స్టెనోసిస్ డి) అస్మోసిస్

3. కొల్లాయిడ్ సోల్ అంటే?
ఎ) నిజ ద్రావణం బి) అవలంభన ద్రావణం
సి) విజాతి సోల్ డి) సజాతి సోల్

4. పొగమంచు కొల్లాయిడ్ విధానం?
ఎ) గాలిలో విస్తరించిన ద్రావణం
బి) గాలిలో విస్తరించిన గాలి
సి) గాలిలో విస్తరించిన ఘనం
డి) ద్రావణంలో విస్తరించిన ఘనం

5. ఫొటో కెమికల్ స్మాగ్ దేని ఉత్పత్తి?
ఎ) పెరాక్సైడ్ నైట్రేట్ బి) కార్బన్ మోనాక్సైడ్
సి) కార్బన్ డై ఆక్సైడ్ డి) ఓజోన్

6. నీలి మందును ఏ పరిశ్రమలో ఉపయోగిస్తారు?
ఎ) ఆహార తయారీ
బి) సుగంధలేపన సి) రంగు తయారీలో
డి) ఫార్మాస్యూటికల్

7. వర్షం నీటి కన్నా నదీ జలాలు కఠినంగా ఎందుకుంటాయి?
ఎ) నది ఎల్లప్పుడూ ప్రవహిస్తుంది
బి) నది సోడియం క్లోరైడ్‌ను కలిగి ఉంటుంది
సి) నది కాల్షియం, మెగ్నీషియం లవణాలను కలిగి ఉంటుంది డి) పైవన్నీ

8. పేపర్ మీద వేలిముద్రలను కనగొనడానికి ఉపయోగించే ద్రవం?
ఎ) సిల్వర్ నైట్రేట్ బి) నిక్‌హైడ్రిన్
సి) యూనివర్సల్ గ్రేపౌడర్ డి) ఏదీకాదు

